TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక

# హంస కలం వార్త

HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి

EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:58 THURSDAY, JULY 09, 2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 58 గురువారం 09 జూలై 2026 పేజీలు :8 వెల: 4/-




## ఇండోనేషియా నుంచి మోదీకి ఐదు యుద్ధ విమానాల ఎస్కార్ట్



**-మోదీకి ఇండోనేషియా మరో అరుదైన గౌరవం.. వీడ్కోలులోనూ వెంట వచ్చిన యుద్ధ విమానాలు**
**-3 రోజుల పర్యటన ముగించుకుని ఆస్ట్రేలియాకు బయలుదేరిన ప్రధాని**
**-విమానాశ్రయంలో అధ్యక్షుడు ప్రబోవో స్వయంగా వీడ్కోలు**
**-రక్షణ, సాంకేతిక రంగాల్లో కొత్త సహకారానికి మార్గం**
**-ఇండోనేషియా మోదీ కృతజ్ఞతలు**

హంసకలం వార్త : మూడు రోజుల అధికారిక పర్యటన ముగించుకుని ఇండోనేషియా నుంచి ఆస్ట్రేలియాకు బయలుదేరిన ప్రధాని నరేంద్ర మోదీకి ఆ దేశం నుంచి అరుదైన గౌరవం దక్కింది. మోదీ ప్రయాణిస్తున్న ప్రత్యేక విమానానికి ఇండోనేషియా వైమానిక దళానికి చెందిన ఐదు యుద్ధ విమానాలు ఎస్కార్ట్‌గా వెళ్లాయి. రెండు దేశాల మధ్య బలపడుతున్న సంబంధాలకు ఇది ప్రతీకగా నిలిచింది. ఇండోనేషియా గగనతలంలో మోదీ విమానంతో పాటు యుద్ధ విమానాలు సమాంతరంగా ప్రయాణించిన దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మోదీ **మిగతా2లో**

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి.. సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ



ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు గ్రీన్ గ్రోత్ ఎకనమిక్ సమ్మిట్ నిర్వహిస్తున్న మెరీడియన్ కలెక్టివ్ ప్రతినిధులు రిత్వికా భట్టాచార్య , ఉమా భట్టాచార్య, లోక్‌సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

హంసకలం వార్త : కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం**మిగతా2లో**




## ఢిల్లీ నుంచి సిలిగురికి 6 గంటల్లో

**సిలిగురికి 6 గంటల్లో.. పట్టాలెక్కిన బుల్లెట్ రైల్ ప్లాన్**

హంసకలం వార్త : దేశంలో హైస్పీడ్ రైల్వే విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేస్తోంది. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టుకు తోడు ఢిల్లీ కేంద్రంగా నాలుగు కొత్త హైస్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధమవుతు న్నాయి. వీటిలో ఢిల్లీ-వారణాసి-సిలిగురి కారిడార్ అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా పట్టాలెక్కుతోంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో ఒకటిగా, దేశంలోనే అత్యంత పొడవైన **మిగతా2లో**

### తెలంగాణలో రూ.300 కోట్ల గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..

ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి తో గోద్రేజ్ గ్రూపు సంస్థల కార్పొరేట్ అఫేర్స్ ప్రెసిడెంట్ రాకేష్ స్వామి, ఆగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగత నియోగి భేటీ






## తెలంగాణలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటన

హంసకలం వార్త

కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా గురువారం తెలంగాణలో పర్యటించనున్నారు. పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ **2లో**

## 'కొత్త కేటాయింపు కాదు'

**తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ**

హంసకలం వార్త :

సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ -2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమా ర్క అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తు చేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటి అని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో



పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆం యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా**2లో**



## రైతులకు శుభవార్త..

**రెండెకరాలకు ఒకేసారి యూరియా**

**సులభతరం చేసిన వ్యవసాయ శాఖ.. యాప్‌లో కీలక మార్పులు**

హంసకలం వార్త : ఈ వానాకాలం సీజన్‌లో 45 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం

సిద్దిపేట: యూరియా కోసం రైతులు తెల్లవారుజాము నుంచే ఆగ్రోస్ కేంద్రాలు, సహకార సంఘాలు, ఎరువుల దుకాణాల ముందు గంటల తరబడి బారులు తీరాల్సిన అవసరం ఇక ఉండదు. రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని, యూరియా పంపిణీ వ్యవస్థను ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. గత యాసంగిలో ప్రవేశపెట్టిన యాప్ ద్వారా బుకిం గ్ విధానంలో వ్యవసాయ శాఖ అధికారులు మార్పులు చేశారు. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వచ్చాయని అధికారులు తెలిపారు.

**నిల్వలుసిద్ధం:** ఈ వానాకాలం సీజన్‌లో సిద్దిపేట జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయని అంచనా. దీనికి గాను 45,933 మెట్రిక్ టన్నుల-**మిగతా2లో**



### భారత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చడమే లక్ష్యంగా 'అల్-మాలిక్ ఇస్లామిక్ యూత్'

## ఏర్పాటు

2

-విజయవాడలో ఎన్ఐఏ మెగా దాడులు: ఐసిస్, అల్ ఖైదా టెర్రర్ నెట్‌వర్క్ గుట్టురట్టు!
-వించిపేట పరిసర ప్రాంతాల్లో ఎన్ఐఏ విస్తృత సోదాలు
-విదేశీ హ్యాండ్లర్ అల్-హకీమ్ షకూర్ ఆదేశాలతో ఐసిస్, అల్ ఖైదా నెట్‌వర్క్ విస్తరణ
-ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ గ్రూపుల ద్వారా యువతకు ఉగ్రవాద శిక్షణ, ఆత్మాహుతి దాడులకు ప్రేరేపణ
-హైదరాబాద్‌కు చెందిన సయీదా బేగంతో ప్రత్యేక మహిళా వింగ్ ఏర్పాటుకు కుట్ర

## నిరంజన్ మృతి కలచివేసింది



హంసకలం వార్త

హనుమకొండకు చెందిన తన అభిమాని నిరంజన్ మృతిపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోషల్ మీడియా వేదికగా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'నిరంజన్ ఇక లేడనే వార్త నా హృదయాన్ని తీవ్రంగా కలచివేసింది' అంటూ పవన్ కల్యాణ్ సంతాపం వ్యక్తం చేశారు. చిన్నారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. అలాగే నిరంజన్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ తీరని విషాదాన్ని భరించే శక్తిని వారికి ఆ భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించానని అన్నారు.**మిగతా2లో**

## రైతు డిస్కం ఏర్పాటులో ట్విస్ట్!




- టీజీఆర్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీకి ఎన్‌వోసీ ఇవ్వని టీజీఎస్పీడీసీఎల్
- లైసెన్స్, కంపెనీ రిజిస్ట్రేషన్లపై సందిగ్ధం
- రైతు డిస్కం ఏర్పాటులో మరింత జాప్యం!

హంసకలం వార్త : రాష్ట్రంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయదల్చిన తెలంగాణ రైతు విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఆర్పీడీసీఎల్) ఏర్పాటులో కొత్త మలుపు చోటుచేసుకుంది. రైతు డిస్కం ఏర్పాటు ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికి మాతృసంస్థ అయిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీ సీఎల్) నుంచి అవసరమైన **2లో**



## వివరణ ఎందుకు ఇస్తా?

- కొండా సురేఖ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన కడియం శ్రీహరి
- తన దేవాదాయ శాఖలో శ్రీహరి సమీక్ష నిర్వహించారంటూ సురేఖ ఫిర్యాదు
- చర్యలు తీసుకోవాలంటూ రేవంత్‌ను కోరిన వైనం
- తానెప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పని చేస్తానన్న శ్రీహరి

2

# తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..

కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కీలక చర్చలు జరిపారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్ ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ పురోగతిని వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

# తెలంగాణలో రూ.300 కోట్ల గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి బుధవారం కలిశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ ఆగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ఢిల్లీ నుంచి సిలిగురికి 6 గంటల్లో.. పట్టాలెక్కిన బుల్లెట్ రైల్ ప్లాన్

వీటిలో ఢిల్లీ-వారణాసి-సిలిగురి కారిడార్ అత్యంత ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా పట్టాలెక్కుతోంది. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ రైలు కారిడార్లలో ఒకటిగా, దేశంలోనే అత్యంత పొడవైన బుల్లెట్ రైలు మార్గంగా రూపుదిద్దుకోనుంది. ఈ ప్రాధాన్య కారిడార్లకు సుమారు రూ.2 లక్షల కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రతిపాదిత కారిడార్ సుమారు 1,705 కిలోమీటర్ల పొడవు ఉండగా.. ప్రస్తుతం దాదాపు 20 గంటల సమయం పట్టే ఢిల్లీ-సిలిగురి ప్రయాణాన్ని కేవలం 6 గంటల్లో పూర్తిచేసే దిశగా ప్లాన్ చేస్తున్నారు అధికారులు. ఈ మార్గంలో ఢిల్లీ, నొయిడా, ఆగ్రా, లఖ్‌నవూ, వారణాసి, బక్సర్, పాట్నా, బేగుసరాయ్, ఖగారియా, కటిహార్, సిలిగురి వంటి ప్రధాన నగరాలు అనుసంధానంకాను న్నాయి. భవిష్యత్తులో ఈ మార్గాన్ని గువాహటి వరకు విస్తరించే అవకాశాన్ని కూడా అధికారులు పరిశీలిస్తు న్నారు. ఈ ప్రాజెక్టులో గంటకు గరిష్ఠంగా 320 కిలోమీటర్ల వేగంతో బుల్లెట్ రైళ్లు నడిచేలా అధికా రులు ప్లాన్ చేశారు. ప్రస్తుతం రైల్వే శాఖ సర్వేలు, సాధ్యాసాధ్యాల అధ్యయనాలు నిర్వహి స్తుండగా, ఢిల్లీ-వారణాసి హైస్పీడ్ కారిడా ర్‌కు సంబంధించిన సివిల్ నిర్మాణాల డిజైన్ కన్సల్టెన్సీ కోసం నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్(NHSRCL) టెండర్లనూ ఆహ్వానిం చింది. మరో వైపు.. ఢిల్లీ-జైపూర్-ఉదయ్‌పూర్-అహ్మదాబా ద్, ఢిల్లీ-అమృత్‌సర్-జమ్మూ కారిడార్లు కూడా ప్రతిపాదనల్లో ఉన్నాయి. ఇవి అమల్లోకి వస్తే ఉత్తర, పశ్చిమ, తూర్పు భారత ప్రాంతాల మధ్య వేగవంతమైన రైలు అనుసంధానం ఏర్పడుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. ఢిల్లీ కేంద్రం గా ప్రతిపాదించిన ఈ నాలుగు బుల్లెట్ రైలు మార్గా ల్లో ఏదీ ఇంకా నిర్మాణ దశలోకి చేరలేదు. సర్వేలు, మార్గ నిర్ధారణ, డీపీఆర్‌లు, ఆర్థిక అనుమతులు వంటి ప్రక్రియలు కొనసాగుతున్నాయి. మరోవైపు ముంబై-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు తొలి దశను 2027లో, పూర్తి కారిడార్‌ను 2029 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.

# ఇండోనేషియా నుంచి మోదీకి ఐదు యుద్ధ విమానాల ఎస్కార్ట్

మోదీ జకార్తాకు చేరుకున్న సమయంలోనూ ఆయన విమానానికి ఇండోనేషియా ఫైటర్ జెట్లు ఎస్కార్ట్‌గా వచ్చి స్వాగతం పలికాయి. పర్యటన ముగిసిన తర్వాత ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో స్వయంగా విమానాశ్రయానికి వచ్చి మోదీకి వీడ్కోలు పలికారు. విమానంలోకి ఎక్కే ముందు ఇద్దరు నాయకులు ఆత్మీయంగా ఆలింగనం చేసుకు న్నారు. ఈ పర్యటనతో భారత్, ఇండోనేషియా మధ్య పలు కీలక రంగాల్లో సహకారానికి కొత్త అవకాశాలు ఏర్పడ్డాయని ప్రధాని మోదీ తెలిపారు. రక్షణ, భద్రత, సముద్ర సహకారం, కృత్రిమ మేధ, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో కలిసి పనిచేసే దిశగా కీలక అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. తనకు ఆత్మీయ స్వాగతం పలికిన ఇండోనేషియా ప్రజలకు, అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోకు మోదీ కృతజ్ఞత లు తెలిపారు. ఇరు దేశాల భాగస్వామ్యాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ఆయన చూపిన వ్యక్తిగత చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

# రైతులకు శుభవార్త.. రెండెకరాలకు ఒకేసారి యూరియా!

ఈ వానాకాలం సీజన్‌లో సిద్దిపేట జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగు కానున్నాయని అంచనా. దీనికి గాను 45,933 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని గుర్తించారు. ప్రస్తుతం జిల్లాలో 9 వేల మెట్రిక్ టన్నుల స్టాక్ అందుబాటులో ఉంది. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో యాప్ ద్వారా 2,52,960 బస్తాల యూరియాను రైతులు కొనుగోలు చేశారు.

**కొత్త విధానం ఇలా...**

రైతుల భూవిస్తీర్ణాన్ని బట్టి యూరియా బుకింగ్ చేసుకునేలా దశలవారీ విధానాన్ని అమలు చేస్తున్నారు గతంలో మూడు విడతలుగా (15 రోజుల వ్యవధిలో) బుకింగ్ చేసుకోవాల్సి వచ్చేది. ఇకపై రెండెకరాల పట్టా ఉన్న రైతులు ఒకేసారి బుకింగ్ చేసుకొని యూరియా తీసుకోవచ్చు. 2ఎకరాల నుంచి 5 ఎకరాలు ఉన్న వారు తమ బుకింగ్‌ను రెండు విడతలుగా చేసుకోవాలి. ఐదు ఎకరాలు, ఆపైన ఉన్న వారు మూడు విడతలుగా బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుంది. ఒక బుకింగ్‌కు, మరో బుకింగ్‌కు మధ్య 20 రోజుల సమయం ఉండాలని అధికారులు స్పష్టం చేశారు. ఈ మార్పుల వల్ల రైతులకు యూరియా సకాలంలో అందడమే కాకుండా, సాగు ప్రణాళికలు రూపొందించుకోవడానికి వీలు కలుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి పేర్కొన్నారు.

# రైతు డిస్కం ఏర్పాటులో ట్విస్ట్..!

రైతు డిస్కం ఏర్పాటు ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న అధికారికి మాతృసంస్థ అయిన దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) నుంచి అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) నిరాకరించడం తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వం ఆదేశాల మేరకు టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీ అనిల్ కుమార్ ఈ ఏడాది మార్చి 1 నుంచి రైతు డిస్కం ఏర్పాటుకు సంబంధించి పూర్తిస్థాయిలో పనిచే స్తున్నారు. కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంసీఏ) వద్ద కంపెనీ నమోదు, అవసరమైన కార్పొరేట్ వ్యవహారాలు, తెలంగాణ విద్యుత్ నియం త్రణ కమిషన్ (టీజీఈఆర్సీ)లో పంపిణీ లైసెన్స్ దర ఖాస్తు తయారీ, సమర్పణ, కంపెనీ రిజిస్ట్రేషన్ చేసే కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో తనకు ఎన్‌వోసీని మంజూరు చేయాలని అనిల్ కుమార్ చేసిన విజ్ఞప్తిని టీజీఎస్పీడీసీఎల్ తిరస్కరిస్తూ రెండురోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. అనిల్ కుమార్‌కు ఎన్‌వోసీ జారీ చేయకపోతే రైతు డిస్కం ఏర్పాటులో మరింత జాప్యం నెలకొనే అవకాశాలుం టాయని విద్యుత్‌రంగ వర్గాలు అభిప్రాయపడు తున్నాయి.

**కొత్త నియామకాల్లేవ్.. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత**

విద్యుత్ సంస్థల్లో కొన్నేళ్లుగా కొత్త నియామకాలు లేకపోవడంతో క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ఎస్పీడీసీఎల్‌లో సెక్షన్ స్థాయిలో ఏఈలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతు న్నాయి. ఈ నేపథ్యంలో దక్షిణ డిస్కం నుంచి పెద్ద సంఖ్యలో సిబ్బందిని రైతుడిస్కంకు డిప్యూటేషన్‌పై బదిలీ చేస్తే మరిన్ని ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉంటాయని పలు కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# వివరణ ఎందుకు ఇస్తా?: కొండా సురేఖ ఫిర్యాదుపై తీవ్రంగా స్పందించిన కడియం శ్రీహరి

తనకు చెందిన దేవాదాయ శాఖ అధికారులతో అధికారిక సమీక్ష నిర్వహించారంటూ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై సీఎం రేవంత్ రెడ్డికి మంత్రి కొండా సురేఖ ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కడియం శ్రీహరిని వివరణ కోరాలని... విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని ఆమె కోరారు. సురేఖ చేసిన ఫిర్యాదుపై కడియం శ్రీహరి తీవ్రంగా స్పందించారు. "నేను ఏ తప్పూ చేయలేదు. అలాంటప్పుడు ఎవరికీ వివరణ ఇవ్వాల్సిన అవసరం నాకు లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తాను ఎప్పుడూ ప్రోటోకాల్‌కు లోబడే పనిచేస్తానని స్పష్టం చేసిన కడియం... ఇదంతా కేవలం అవగాహన లోపం వల్లనే జరుగుతోందని అన్నారు. దేవాదాయ శాఖపై సమీక్ష నిర్వహించే హక్కు తనకు లేదనే విషయం ఒక ప్రజాప్రతినిధిగా తనకు తెలుసని కడియం శ్రీహరి అన్నారు. "నా నియోజకవర్గంలోని పలు ఆలయాల సమస్యల పరిష్కారం కోసం మాత్రమే సంబంధిత శాఖ కమిషనర్, అధికారులు, ఆలయ చైర్మన్లను కలిశాను. అక్కడ ఎలాంటి అధికారిక సమీక్ష నిర్వహించలేదు. కేవలం క్షేత్రస్థాయి సమస్యలను మాత్రమే వారి దృష్టికి తీసుకెళ్లాను" అని వివరించారు. దేవాదాయ శాఖలో నిధులు లేవని చెప్పడంతో... ఆలయాల అభివృద్ధికి సంబంధించిన ఎస్టిమేషన్‌లను (అంచనాలను) మాత్రమే కోరినట్లు వెల్లడించారు. ఈ వివాదంపై కొండా సురేఖను ఉద్దేశించి కడియం శ్రీహరి పరోక్షంగా ఘాటు వ్యాఖ్యలు చేశారు. "రాజకీయాల్లో కొందరు కొత్త అలవాట్లు నేర్చుకున్నారు. నిత్యం ఏదో ఒక కాంట్రవర్సీ క్రియేట్ చేస్తూ... వార్తల్లో ఉంటూ ప్రజల మధ్య బతకాలని చూస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. తన నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం తాను ఎవరినైనా కలుస్తానని... అవసరమైతే మంత్రులను, ముఖ్యమంత్రిని కూడా కలిసి నిధులు సాధించుకుంటానని స్పష్టం చేశారు.

# టీవీ షోలో అవకాశం పేరుతో.. మహిళపై అత్యాచారం

హైదరాబాద్‌లో అమానుష ఘటన చోటుచేసుకుంది. టెలివిజన్ షోలో పాల్గొనే అవకాశం కల్పిస్తామని నమ్మబలికిన ఇద్దరు వ్యక్తులు ఓ మహిళపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. సికింద్రాబాద్‌లోని రాణిగ ంజ్‌లో మంగళవారం జరిగిన ఈ ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఇద్దరు అనుమానితు లను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన 43 ఏళ్ల బాధితురాలు, వరకట్న వేధింపులు మరియు కుటుంబ కలహాల కారణంగా గత రెండేళ్లుగా భర్తకు దూరంగా ఉంటూ, తన ఏడేళ్ల కుమారుడితో కలిసి జీవిస్తున్నారు. తన కుటుంబ సమస్యలను పరిష్కరిం చేందుకు ఒక టెలివిజన్ కార్యక్రమంలో పాల్గొనాలని ఉద్దేశంతో ఆమె హైదరాబా ద్‌కు వచ్చారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఉండగా ఓ వ్యక్తి ఆమెను పరిచయం చేసుకుని, టీవీ షో నిర్వాహకులతో తనకు పరిచయాలు ఉన్నాయని నమ్మబలికాడు. అనంతరం ఆమెను రాణిగంజ్‌లోని హైదర్ కాంప్లెక్స్‌లో ఉన్న ఒక నిర్మానుష్య భవనంలోకి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత మరో వ్యక్తి కూడా అక్కడికి చేరుకుని ఆమెపై అఘాయిత్యా నికి ఒడిగట్టాడు. బాధితురాలు గట్టిగా కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. అనంతరం ఆమె నేరుగా మహంకాళి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## 'కొత్త కేటాయింపు కాదు'.. తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ

కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

## నిరంజన్ మృతి కలచివేసింది

కాగా, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న నిరంజన్ కోరిక మేరకు గత నెల 17న పవన్ కల్యాణ్ హనుమకొండలోని అతని ఇంటికి వెళ్లి పరామర్శించిన విషయం తెలిసిందే. అయితే మంగళవారం అర్ధరాత్రి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిరంజన్ తుదిశ్వాస విడిచాడు. ఈ విషాద ఘటనపై పవన్ కల్యాణ్ ఎక్స్ (శ) వేదికగా స్పందిస్తూ.. తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. చిన్నారితో గడిపిన క్షణాలను ఆయన గుర్తు చేసుకున్నారు.

## భారత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చడమే లక్ష్యంగా 'అల్-మాలిక్ ఇస్లామిక్ యూత్' ఏర్పాటు

ఆంధ్రప్రదేశ్‌లో ఉగ్రవాద ముఠా లింకుల కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) బుధవారం ఉదయం నుండి ముమ్మర సోదాలు నిర్వహిస్తోంది. విజయవాడలోని వించిపేట ప్రాంతంలో నిందితుల ఇళ్లు, వారు నివసించిన స్థావరాలపై ఎన్‌ఐఏ అధికారులు ఏకకాలంలో దాడులు చేపట్టారు. ఇటీవల విజయవాడ టు టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ఎన్‌ఐఏకు బదిలీ అయిన ఈ కేసు విచారణలో భాగంగా, నిందితులకు ఇతర వ్యక్తులు లేదా అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో ఉన్న సంబంధాలను వెలికితీసేందుకు ఈ తనిఖీలు జరుగుతున్నాయి. అంతకుముందు, ఏపీ కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిఘా ఉంచి ఈ ముఠా కార్యకలాపాలను కనిపెట్టి, నెట్‌వర్క్‌ను ఛేదించింది. ఈ కేసులో ఇప్పటివరకు విజయవాడకు చెందిన మహ్మద్ రహ్మతుల్లా షరీఫ్ (23), ఎండీ డానిష్ (27), మీర్జా సోహైల్ బేగ్ (23)లతో పాటు హైదరాబాద్‌కు చెందిన సయీదా బేగం (38), కర్ణాటక బళ్లారికి చెందిన అబ్దుల్ సలాంలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు ఎఫ్ఐఆర్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, ఢిల్లీ, రాజస్థాన్, కర్ణాటక, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాలకు చెందిన మొత్తం 12 మంది నిందితుల పేర్లు ఉన్నాయి. వీరంతా 'అల్-మాలిక్ ఇస్లామిక్ యూత్' అనే గ్రూపుగా ఏర్పడి, విదేశీ హ్యాండ్లర్ అల్-హకీమ్ షకూర్ నిర్దేశకత్వంలో ఐసిస్, అల్-ఖైదా నెట్‌వర్క్‌ను భారత్‌లో విస్తరించడానికి పనిచేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది.

**దిగ్భ్రాంతికరమైన కుట్ర కోణాలు**

ఎన్‌ఐఏ అధికారుల విచారణలో నిందితులు తమ దేశద్రోహ ప్రణాళికలను అంగీకరించారు. భారత్‌ను ఇస్లామిక్ దేశంగా మార్చడం, భారత జాతీయ జెండా స్థానంలో ఐసిస్ జెండాను ఎగురవేయడం, 'గజ్వా-ఎ-హింద్' కోసం పనిచేయడమే తమ ముఖ్య లక్ష్యాలని వారు వెల్లడించారు. ఇందుకోసం ఇన్‌స్టాగ్రామ్, టెలిగ్రామ్ వేదికగా 'దీజుచీశ జూవీ' అనే రహస్య గ్రూపులను క్రియేట్ చేశారు. ఇందులో కొంతమంది పాకిస్థానీయులు కూడా సభ్యులుగా ఉన్నట్లు గుర్తించారు. ఈ గ్రూపుల ద్వారా జిహాద్ కోసం ప్రాణాలర్పించడానికి సిద్ధంగా ఉన్న యువతను చేర్చుకుని, వారిని ఆత్మాహుతి దాడులకు ప్రేరేపించేవారు.

## తెలంగాణలో కేంద్రమంత్రి జేపీ నడ్డా పర్యటన..

పలు కార్యక్రమాలకు ఆయన హాజరుకానున్నారు. ఈ మేరకు నడ్డా పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఉదయం 10:55 నిమిషాలకు శంషాబాద్ ఎయిర్ పోర్టుకు చేరుకోనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు బీబీనగర్ ఎయిమ్స్‌కు వెళ్లనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 1:30 గంటల వరకు ఎయిమ్స్‌పై సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. 2:45 నుంచి బీబీనగర్ ఎయిమ్స్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి బయల్దేరనున్నారు. మధ్యాహ్నం 3:30 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లనున్నారు. రేపు మధ్యాహ్నం 3:30 నుంచి 5 గంటల వరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నేతలతో నడ్డా కీలక సమావేశం నిర్వహించనున్నారు. సాయంత్రం 5:10 గంటలకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి తాజ్ డెక్కన్‌కు వెళ్లనున్నారు. సాయంత్రం 5:30 నుంచి 7 గంటల వరకు తాజ్ డెక్కన్‌లో మేధావులతో సమావేశం కానున్నారు. తాజ్ డెక్కన్ నుంచి 7:10 నిమిషాలకు బయలుదేరి శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌నకు వెళ్లనున్నారు. రాత్రి 9 గంటలకు శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి జేపీ నడ్డా వెళ్లనున్నారు.

# సంపాదకీయం


## యాభయ్యేళ్లుగా తేలని ఓ కేంద్రమంత్రి హత్య కేసు

మన దేశంలోని కేంద్రమంత్రి ఒకరు బాంబుల దాడిలో హతుడై అర్ధశతాబ్దం దాటినా, ఆ కేసు ఇంకా ఉన్నత న్యాయస్థానంలో నలుగుతూనే ఉంది. న్యాయస్థానాల చరిత్రలో ఇంత సుదీర్ఘకాలం నలుగుతున్న హత్య కేసు కూడా ఇదే. హతుడు నాటి రైల్వే మంత్రి లలిత్ నారాయణ్ మిశ్రా. 1975 జనవరి 2న బిహార్‌లోని సమస్తిపూర్ రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన జరిగింది. బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మిశ్రాపై దుండగులు గ్రెనేడ్లు విసరగా, ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ, రైల్వే ఉద్యోగి రామ్‌కిశోర్ ప్రసాద్ అక్కడికక్కడే మరణించారు, 25 మంది గాయపడ్డారు. దానాపూర్‌లో చికిత్స పొందుతూ జనవరి 3న మిశ్రా మరణించారు. సీబీఐ దర్యాప్తు చేపట్టి, దాడికి బాధ్యులుగా ఆనంద్ మార్గ్ అనుచరులు నలుగురిని, న్యాయవాది రంజన్ ద్వివేదిని అరెస్టు చేసింది. వెంటనే ఆనంద్ మార్గ్‌ను కేంద్రం రెండేళ్లపాటు నిషేధించింది. 1977లో పాట్నాలో ఈ ఐదుగురిపై చార్జిషీట్ దాఖలు చేసింది. 1979లో కేసు ఢిల్లీకి బదిలీ అయింది. 2014 డిసెంబర్‌లో, అంటే ఘటన జరిగిన 39 ఏళ్లకు ఢిల్లీ ట్రయల్ కోర్టు తీర్పు ఇచ్చింది. సీబీఐ చార్జిషీట్ ప్రకారం, ఆనంద్ మార్గ్ నాయకుడు ప్రభాత్ రంజన్ సర్కార్ హత్య కేసులో జైల్లో ఉన్నాడు. అతడిని విడిపించేందుకు ఇందిర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఆ సంఘం నిర్ణయించింది. అందులో భాగంగానే మిశ్రాపై ఈ గ్రెనేడ్ దాడి జరిగింది. ట్రయల్ కోర్టు విచారణ కాలంలో 20 మందికి పైగా జడ్జిలు మారారు. మొత్తం 200 మంది సాక్షులను విచారించారు. 2014 డిసెంబర్ 18న తీర్పు వచ్చింది. ఒక నిందితుడు విచారణ దశలోనే చనిపోయాడు. సంతోషానంద అవధూత, సుదేవానంద అవధూత, గోపాల్జీ, రంజన్ ద్వివేదిలకు యావజ్జీవ శిక్ష, జరిమానాలు విధించారు. నిందితులు 2015లో ఢిల్లీ హైకోర్టులో అప్పీల్ చేశారు. మిశ్రా మనవడు, న్యాయవాది వైభవ్ మిశ్రా ఏళ్లుగా ఈ కేసు వెంట పడుతున్నారు. సీబీఐ నిర్లక్ష్యంగా దర్యాప్తు చేసిందని, అసలు సూత్రధారులను వదిలేసిందని వాదిస్తున్నారు. 2015 నాటి అప్పీల్ పెండింగ్‌లో ఉండగానే వైభవ్ ఢిల్లీ హైకోర్టులో క్రిమినల్ మిస్లేనియస్ అప్లికేషన్ దాఖలు చేశారు. అసలు సూత్రధారులను గుర్తించేందుకు కేసును మొదటి నుంచి దర్యాప్తు చేయాలని కోరారు. ఇందుకు 1978 బిహార్ పోలీస్ నివేదిక, 1979 తార్కుండే నివేదిక, సమస్తిపూర్ మేజిస్ట్రేట్ ముందు ముగ్గురు అనుమానితులు ఇచ్చిన వాంగ్మూలాలను ఆధారంగా చూపారు. అనుమానితుల్లో ఇద్దరిపై హత్య అభియోగాలను ఉపసంహరించారని గుర్తుచేశారు. 2022 మార్చిలో సీబీఐకి సహాయపడేందుకు వైభవ్‌కు హైకోర్టు అనుమతిచ్చింది. కానీ 2023లో పునర్ దర్యాప్తు డిమాండ్‌ను తోసిపుచ్చింది. ఢిల్లీ హైకోర్టు డివిజన్ బెంచ్‌కు సహకరించాలని వైభవ్‌ను సుప్రీంకోర్టు ఆదేశించింది. 2025 మార్చిలో పునర్ దర్యాప్తుకు సీబీఐ నిరాకరించింది. సీబీఐ నివేదికపై వాదనలు వినేందుకు 2026 మే 18కు కేసు వాయిదా వేశారు. మిశ్రా హత్య దర్యాప్తుకు నాటి ప్రధాని ఇందిరాగాంధీ నియమించిన జస్టిస్ కెకె మాథ్యూ కమిషన్‌ను నమ్మని మొరార్జీ ప్రభుత్వం... 1977లో జస్టిస్ వీఎం తార్కుండే కమిషన్‌ను వేసింది. ఆ కమిషన్ 1979 ఫిబ్రవరి 15న నివేదిక ఇచ్చింది. హత్య వెనుక లోతైన రాజకీయ కుట్ర ఉందని, ఆనంద్ మార్గీయులే కాక బడా రాజకీయ నాయకుల పేర్లు కూడా ఆ నివేదికలో ఉన్నాయని వైభవ్ వాదిస్తున్నారు. ఆ పేర్లను కోర్టులో బయటపెట్టలేదు. 1978 ఆగస్టులో అప్పటి ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ ఆదేశంతో బిహార్ సీఐడీ అక్టోబర్‌లో నివేదిక ఇచ్చింది. సీబీఐ దాన్ని పరిగణించలేదని వైభవ్ ఆరోపణ. సీబీఐ మొదట అరుణ్‌కుమార్ ఠాకూర్, అరుణ్‌కుమార్ మిశ్రా, ఉమాకాంత్, శివలాల్ శర్మలను అరెస్ట్ చేసింది. వారు మేజిస్ట్రేట్ ముందు వాంగ్మూలాలు ఇచ్చారు. 1975 నవంబర్‌లో ఇద్దరు అరుణ్‌లపై హత్య అభియోగాలు ఉపసంహరించారు. సీఆర్‌పీసీ 164 కింద నమోదైన వాంగ్మూలాలను పక్కనపెట్టి కేసును ఇతరులవైపు మళ్లించారని వైభవ్ ఆరోపిస్తున్నారు. 2026 మార్చిలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌తో వైభవ్ మాట్లాడుతూ, హత్యలో రాజకీయ ప్రముఖుల జోక్యం ఉందని, వారి పేర్లు వాంగ్మూలంలో ఉన్నాయని చెప్పారు. 1979లో పాత్రికేయుడు అరుణ్‌శౌరి రాసిన 'ఎల్ఎన్ మిశ్రాను ఎవరు హత్య చేశారు' పుస్తకంపైనే కుటుంబం ఆధారపడుతోంది. తార్కుండే నివేదికలో మాజీ ఎమ్మెల్సీ రామ్‌బిలాస్ ఝా పేరు ఉందని, పెద్ద రాజకీయ కుట్రను నివేదిక సూచించిందని శౌరి రాశారు. యశ్‌పాల్ కపూర్ ఇందిరాగాంధీ కార్యదర్శి. కాంగ్రెస్‌లో శక్తిమంతుడు. అతనికి రామ్‌భిలాస్ ఝా సన్నిహితుడు. ప్రస్తుతం కేసు 2026 మే 18 వరకు సాగింది. ఆ తర్వాత ఏమైందో తెలియదు. భారత న్యాయవ్యవస్థ చరిత్రలో అర్ధ శతాబ్దానికి పైగా సాగుతున్న క్రిమినల్ కేసు ఇదే. ముంబై దాడుల నిందితుడు కసబ్ కేసులో ఎక్కువ సాక్షులు ఉన్నా, తీర్పు తొమ్మిదేళ్లకే వచ్చింది. లింకన్, కెనడి హత్య కేసులు నెలల్లోనే తేలాయి. ప్రపంచంలోనే ఇంతకాలం సాగిన క్రిమినల్ కేసు మిశ్రా హత్య కేసేనేమో.

# ఈ పరిణామాలు దేనికి సంకేతం?







'అయోధ్య రామమందిరంలోని హుండీల్లో ఉన్న డబ్బును తస్కరించడంపై ఆచితూచి మాట్లాడండి. ఈ అవినీతి వ్యవహారం మొత్తం హిందూ సమాజానికి మనస్తాపం కలిగించింది. కొంతమంది తప్పుడు వ్యక్తుల మూలంగా ఇది జరిగింది. నేరస్థులను ప్రభుత్వం వదిలిపెట్టదు' అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. రెండు రోజుల క్రితం ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ కీలక నేతల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అయోధ్య ఘటనలు బీజేపీని ఎంతగా కుదిపివేశాయో నితిన్ నబీన్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. నిజానికి బీజేపీ ఆఫీసు బేరర్లు, కార్యవర్గ సభ్యులను నియమించడంతో పాటు కేంద్ర ప్రభుత్వంలోనూ భారీ ఎత్తున మార్పులు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సన్నద్ధమవుతున్న తరుణంలో అయోధ్యలో దొంగతనాలు వెలుగులోకి వచ్చాయి. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందే ఈ మార్పులకు శ్రీకారం చుట్టి పార్టీకి, ప్రభుత్వానికి కొత్త రూపురేఖలు తీర్చిదిద్దేందుకు మోదీ సన్నద్ధమయ్యారు. అనేక స్థాయిల్లో కీలక చర్చలు జరిపారు. కేబినెట్ మంత్రులు, సహాయ మంత్రులతో ఆయన వేర్వేరుగా, కలిసికట్టుగా గంటల తరబడి సమీక్షా సమావేశాలు నిర్వహించారు. మార్పులు తప్పవన్న సంకేతాలనిచ్చారు. కేంద్ర ఆర్థిక మంత్రి, విద్యామంత్రి, సహా పలువురు మంత్రులకు స్థానచలనం తప్పదని సంకేతాలు రావడంతో ఆయా శాఖల నిర్వహణ సవ్యంగా లేదన్న విషయం స్పష్టమవుతోంది. ప్రధానమంత్రి ఆమోదయోగ్యత శాతం పెరుగుతోందని ఎప్పుడూ సర్టిఫికెట్లు ఇచ్చే మార్నింగ్ కన్సల్టెన్సీ సంస్థ ఈసారి మోదీకి ప్రజాదరణ 75--78శాతం నుంచి 68--70శాతానికి పడిపోయిందని చెప్పడం గమనార్హం. కనుక ప్రధానమంత్రి జాగ్రత్తపడాలనుకోవడంలో ఆశ్చర్యం లేదు. అయితే తలపెట్టిన మార్పులకు ఇది సరైన సమయం కాదనుకున్నారో, లేక అంతర్గతంగా ఏ సమస్యలు వచ్చాయో కానీ ప్రధానమంత్రి వాటిని వాయిదా వేసుకున్నట్లే కనిపిస్తోంది. తమపై వేటు తప్పదేమో అనుకున్న పలువురు మంత్రులు ప్రస్తుతానికి ఊపిరి పీల్చుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. అయోధ్య ఘటనే కాదు, అనేక అంశాలపై దేశంలో ఏదో ఒక వివాదం రేగుతూనే ఉన్నది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రకటించిన ఈక్విటీ నిబంధనలపై వివాదం రగులుతోంది. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మెడికల్ ఎంట్రన్స్ పరీక్ష నీట్-- యూజీ నిర్వహణలో అక్రమాలు, వరుస పేపర్ లీకేజీలు తీవ్ర సంచలనం సృష్టించాయి. విద్యార్థుల నిరసనకు మద్దతుగా లద్దాఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ గత ఎనిమిది రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరాహార దీక్ష నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ--20 ఇథనాల్ బ్లెండింగ్ విధానంపై తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ విధానం వల్ల ఆహార భద్రత దెబ్బతిన్నదని, విధానాల రూపకల్పనలో కొందరు మంత్రుల ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అండమాన్, నికోబార్ దీవుల్లో రూ.90 వేలకోట్ల 'గ్రేట్ నికోబార్ మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్'పై కేంద్ర ప్రభుత్వం-- పర్యావరణ వేత్తలు, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వివాదం నడుస్తోంది. ఈ పరిణామాలన్నిటిపై ఈ నెల 20న ప్రారంభమవనున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షాలు తీవ్ర గందరగోళం సృష్టించేందుకు సన్నద్ధం కావచ్చు. అయితే ప్రతిపక్షాలు అనేవి ఎక్కడున్నాయి? ఇండియా కూటమిలో కీలక భాగస్వాములైన తృణమూల్ కాంగ్రెస్, శివసేన, ఆమ్ ఆద్మీ పార్టీల్లోంచి భారీ ఫిరాయింపులు జరగడంతో ఆ పార్టీలు అస్తిత్వం కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. తమిళనాడులో టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలిపిన తర్వాత ఆ జాతీయ పార్టీకి డీఎంకే దూరమైంది. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా తీవ్ర సంక్షోభంలో ఉన్నది. ఇటీవలి రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీ నిలబెట్టిన స్వతంత్ర అభ్యర్థిని గెలిపించిన తర్వాత జార్ఖండ్ ముక్తి మోర్చా ఉనికి ప్రశ్నార్థకమైంది. తాము ఇండియా కూటమిలో భాగం కాదని ఆమ్ ఆద్మీ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. ఈ దృష్ట్యా పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో కాంగ్రెస్, మరికొన్ని పార్టీలు ఒకటి రెండు రోజులు గందరగోళం సృష్టించినా, ఆ తర్వాత బీజేపీ తన అజెండాను నెరవేర్చుకునేందుకు ఎలాంటి అడ్డూ లేకపోవచ్చు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందే ప్రతిపక్షాలు తీవ్రంగా బలహీనం కావడం, పార్లమెంటు రూపురేఖలు మారడం దేశ రాజకీయాల్లో కీలకమైన పరిణామం అని చెప్పక తప్పదు. ఇంతకంటే ముఖ్యమైనది 130వ రాజ్యాంగ సవరణ బిల్లు, 131వ రాజ్యాంగ సవరణ బిల్లును మళ్లీ ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధం కావడం. గత ఏప్రిల్‌లోనూ, తర్వాత జరిగిన ప్రత్యేక సమావేశాల్లోనూ ఈ బిల్లులను ప్రతిపక్షాలు బలంగా అడ్డుకోవడంలో విజయం సాధించాయి. ఇప్పుడా పరిస్థితి లేదు. ఈ రెండు బిల్లులూ ఆమోదం పొందితే దేశ రాజకీయ, రాజ్యాంగ వ్యవస్థల్లో కొన్ని కీలక మార్పులు జరుగుతాయని అందరూ గట్టిగా భావిస్తున్నారు. ఈసారి మహిళలకు రిజర్వేషన్ కల్పించే రాజ్యాంగ సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన బిల్లులకు రెండింట మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రభుత్వం ఇప్పటికే రంగం సిద్ధం చేసింది. ఈ బిల్లు ఆమోదం పొందితే ప్రస్తుతం జరుగుతున్న జనాభా లెక్కల సేకరణతో నిమిత్తం లేకుండా గత జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన జరిగి తీరుతుంది. ఈసారి పెరిగే సీట్ల సంఖ్యను కూడా నిర్దిష్టంగా బిల్లులో సూచించే అవకాశాలున్నాయి. అంతేకాదు, ప్రభుత్వం ఏర్పర్చే డీలిమిటేషన్ కమిషన్ దేశవ్యాప్తంగా పలు నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చివేసే అవకాశం ఉంటుందనడంలో సందేహం లేదు. వర్షాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న 130వ రాజ్యాంగ సవరణ బిల్లు కూడా కీలకమైనదే. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రుల్లో ఎవరైనా ఒక సీరియస్ కేసులో అరెస్టయి 30 రోజుల పాటు జైల్లో ఉంటే వారిని మరుసటి రోజే పదవి నుంచి తొలగించేందుకు ఆ బిల్లు నుద్దేశించారు. ప్రతిపక్ష ముఖ్యమంత్రులు, మంత్రులపై ఎక్కుపెట్టిన అస్త్రమే ఈ బిల్లు అనే విషయం స్పష్టమవుతోంది. అనుకున్న విధంగా పార్లమెంట్‌లో ఆధిపత్యం సంపాదించి రాజ్యాంగ సవరణల బిల్లులను వర్షాకాల సమావేశాల్లోనే ప్రభుత్వం ఆమోదింపచేసుకోగలిగితే ఇక ఏ బిల్లుకైనా ఎలాంటి అడ్డూ ఉండదు. ముఖ్యంగా ఒకే దేశం--ఒకే ఎన్నిక పేరుతో జమిలి ఎన్నికలకు సంబంధించిన బిల్లును ఆమోదించేందుకు కూడా మార్గం సుగమమవుతుంది. జమిలి ఎన్నికలకు తాము సిద్ధమేనని బీజేపీ ముఖ్యమంత్రులు అందరూ ఇప్పటికే ప్రకటించారు. మహిళలకు రిజర్వేషన్ అమలు చేస్తూనే జమిలి ఎన్నికలు కూడా నిర్వహిస్తే తాము తిరుగులేకుండా మరోసారి అధికారంలోకి రాగలమని బీజేపీ వ్యూహకర్తలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే భారత ప్రజాస్వామ్యంలో అది పెద్ద రాజకీయ పరివర్తన వస్తుందనడంలో సందేహం లేదు. ఈ క్రమంలో 2028లో జరగాల్సిన తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ ఎన్నికలను సార్వత్రిక ఎన్నికల వరకు వాయిదా వేయగలడం తమకు కలిసివచ్చే సదవకాశంగా బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో 2029 నాటికి ఎన్నికలు ఏ విధంగా ఉంటాయి? కొన్ని ప్రాంతీయ పార్టీలు చీలిపోవడం లేదా అస్తిత్వ పరీక్షకు గురికావడం వల్ల బీజేపీ బలోపేతమై పార్లమెంటులో ఆధిపత్యం సాధించడాన్ని కాంగ్రెస్ సీరియస్‌గా భావిస్తున్నట్లు కనిపించడం లేదు. ఎందుకంటే ప్రాంతీయ పార్టీలు మాయమైతే తాము వాటి స్థానంలో బలపడతామని కాంగ్రెస్ నేతలు విశ్వసిస్తున్నారు. నిజంగా అలా జరిగితే మన దేశంలో రెండు పార్టీల వ్యవస్థ ఆవిర్భవిస్తుంది. బీజేపీ యేతర, కాంగ్రెసేతర పార్టీలు క్రమంగా క్షీణించిపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మన ప్రజాస్వామ్యంలో ఇది ఆరోగ్యకర పరిణామమా? ప్రాంతీయ ఆకాంక్షలకు ఇక దేశంలో విలువ ఉండదా? అన్న చర్చలకు ఆస్కారం లేకపోలేదు. ఒడియా, బెంగాల్, ద్రవిడ అస్తిత్వవాదం ఎన్నికల రాజకీయాల్లో నిలదొక్కుకోలేకపోవడమే ఇందుకు కారణం. అయితే ప్రాంతీయ పార్టీలు నిజంగా ప్రాంతీయ ఆకాంక్షలను పరిరక్షిస్తున్నాయా? తమ నేతల మనుగడ కోసం దేనికైనా దిగజారగలిగే ప్రాంతీయ పార్టీలు ప్రజల దృష్టిలో తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయా? అన్న ప్రశ్నలకు కూడా జవాబులు వెదకాల్సి ఉంటుంది. దేశంలో ఎప్పుడూ బహుళ పార్టీల ప్రజాస్వామ్యమే అమలులో ఉన్నదన్న విషయం విస్మరించలేం. కాంగ్రెస్ ప్రధాన శక్తిగా ఉన్న కాలంలో కూడా ఏకైక శక్తిగా ఎప్పుడూ ఉండలేదు. జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు సైతం కాంగ్రెస్ 364 సీట్లతో అత్యధికంగా 46శాతం ఓట్లు సాధించినప్పటికీ ప్రతిపక్షాలు 54శాతం ఓట్లతో 125 సీట్లు గెలుచుకున్నాయి. అవి సమాజంలో భిన్న వర్గాలకు ప్రాతినిధ్యం వహించాయి. 1957లో రెండవ సార్వత్రిక ఎన్నికల నుంచి ప్రాంతీయ పార్టీల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఇందుకు కారణం కాంగ్రెస్ తనకు తిరుగులేదన్న అహంకారంతో ఇష్టారాజ్యంగా ప్రవర్తించడమేనని ఆ పార్టీకి కూడా తెలుసు. కాంగ్రెస్ వైఖరి పుణ్యమా అని ద్రవిడ పార్టీలు, సోషలిస్టు పార్టీలు, ప్రాంతీయ అస్తిత్వవాదం ఆధారంగా ఏర్పడ్డ పార్టీలతో పాటు విభిన్న వర్గాలకు చెందిన పార్టీలు ఏర్పడి సువిశాల భారతదేశ వైవిధ్యానికి ప్రతీకలుగా నిలిచాయి. ఒక దశలో జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వాలే శాశ్వత పరిణామంగా భావించే పరిస్థితి ఏర్పడింది. వాజపేయి లాంటి వారు ప్రాంతీయ ఆకాంక్షలను భారత బహుళ వాదానికి, సమాఖ్య స్ఫూర్తికి అవసరమైన వ్యక్తీకరణలుగా భావించారు. మళ్లీ ఇప్పుడు చరిత్ర వెనక్కు నడుస్తున్నట్లు కనపడుతోంది. ఇది ప్రమాదకరమా, లేక ఆరోగ్యకరమా అన్న చర్చ ప్రధానం కాదు. బాధాకరమైన విషయమేమిటంటే ప్రశ్నలు అడగాల్సిన ప్రతిపక్షాలు తగ్గిపోవడమే.

# సీజనల్ వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

-జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

-జగిత్యాల మున్సిపల్ పరిధిలో పారిశుధ్య చర్యలు, డ్రై డే కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

-ప్రతి ఇంటిని తనిఖీ చేస్తూ దోమల నివారణ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు ఆదేశం

-పరిసరాల పరిశుభ్రతతోనే డెంగ్యూ, చికున్‌గున్యా , మలేరియాను అరికట్టవచ్చు



హంసకలం వార్త

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల మున్సిపల్ పరిధిలోని ఎనిమిదవ వార్డును సందర్శించిన జిల్లా కలెక్టర్ పారిశుధ్య నిర్వహణ, డ్రై డే కార్యక్రమాలు, యాంటీ లార్వా చర్యలు, ఫీవర్ సర్వేలు, దోమల నివారణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పలు వార్డుల ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందితో మాట్లాడి చేపడుతున్న చర్యలను తెలుసుకున్నారు. జిల్లాలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను పూర్తిగా అదుపులోకి తీసుకురావాలంటే ప్రతి ఇంటిని పరిశీలించడం అత్యంత అవసరమన్నారు. ఇళ్లలో పాత టైర్లు, కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, నీరు నిల్వ ఉండే పాత్రలు వంటి వాటిని గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. దోమల లార్వా పెరిగే ప్రాంతాల్లో యాంటీ లార్వా స్ప్రేలు, ఆయిల్ బాల్స్ వినియోగించాలని సూచించారు. ప్రతి రోజు డ్రై డే కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఫీవర్ సర్వేలను నిరంతరం కొనసాగిస్తూ జ్వర లక్షణాలు ఉన్న వారిని వెంటనే పరీక్షలకు పంపించాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులనే నివేదికలుగా సమర్పించాలని, తప్పుడు సమాచారం ఇవ్వకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజల్లో పరిశుభ్రతపై మరింత అవగాహన కల్పించాలని, "మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం -- సీజనల్ వ్యాధులను దూరం చేద్దాం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. చెత్త సేకరణ వాహనాలు, మైకింగ్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. అలాగే వీధి ఆహార విక్రేతల వద్ద పరిశుభ్రత పాటించేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, పరీక్షా కిట్లు, వైద్య సామగ్రి తగినంత అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ మధుసూదన్, డిప్యూటీ వైద్యాధికారి శ్రీనివాస్, జైపాల్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి ..

-తుంబూరు దయాకర్ రెడ్డి



హంసకలం వార్త

ఖమ్మం : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజా హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయాయని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచనల మేరకు ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ 77వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబి స్వర్ణకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణతో కలిసి వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అంతకుముందు ఖమ్మం నగరంలోని 16వ డివిజన్, 7వ డివిజన్లతో పాటు ఖమ్మం రూరల్ మండలంలోని కొండాపురంలో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు దయాకర్ రెడ్డి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దయాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీఇంబర్స్‌మెంట్ వంటి పథకాలతో వైఎస్సార్ పేదల గుండెల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందని, కార్యకర్తలంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీలు జూకూరి గోపాలరావు, బోడా మంగీలాల్, ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిన అనిత, వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు తోట వీరభద్రం, నాయకులు కల్లెం వెంకట్ రెడ్డి, బండి జగదీష్, డివిఆర్ బాబు, మద్ది మల్లారెడ్డి, పుల్లయ్య, లింగాల రవికుమార్, మందడపు రామకృష్ణ రెడ్డి, మందడపు మనోహర్, ఉమ్మినేని కృష్ణ, భీమనాథుల అశోక్ రెడ్డి, కొప్పెర ఉపేందర్, తిప్పిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏనుగు వెంకట్ రెడ్డి, షేక్ ఇమామ్, చింతమల్ల గురుమూర్తి, బోడా శ్రావణ్ కుమార్, తాళ్లూరి రాము, చంద్రు నాయక్, బాణోతు దివ్య, బట్టపోతుల సతీష్, చల్లా కృష్ణారెడ్డి, హారిక నాయుడు, మొగిలిచర్ల సైదులు, ఎయిర్‌టెల్ నర్సింహారావు, వెనిగళ్ళ నాగేశ్వరరావు, ఆటోప్రసాద్, నాగరాజు, విప్లవ్ కుమార్, మద్ది వీరారెడ్డి, వెంపటి రవి, పంతులు నాయక్, చింతమల్ల రవి, బండి సతీష్, కన్నెటి అనిల్, తంబి, కరాటే వేణు, ఉపేందర్, రాజు, తిరుపతమ్మ, రుడావత్ రమాదేవి, కన్నెగంటి రావు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైఎస్సార్‌కు ఘనంగా నివాళులు అర్పించారు.

# పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణ వంద శాతం జరగాలి..

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలి..

-రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్..



హంసకలం వార్త

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయినట్లు, పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు ఓటర్లచే పూరించి తిరిగి బిఎల్ఓకి ఇవ్వడం వంద శాతం జరగాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు వివరాలు, ఓటరుచే పూర్తిచేసిన మీదట తిరిగి బిఎల్ఓకు అప్పగించడం కీలకమని అన్నారు. ఓటరు వివరాలతో పూర్తిచేసిన ఫారాలు బిఎల్ఓ తీసుకున్న మీదట అట్టి ఫారాలు డిజిటలైజేషన్ చేస్తారని, ఇట్టి వారి పేర్లు మాత్రమే ఓటరు డ్రాఫ్ట్ రోల్ లో వస్తాయని అన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో వివరాలు పూర్తి చేసి అందించని ఓటరు పేర్లు డ్రాఫ్ట్ రోల్ లో వుండే విధంగా ప్రతి ఒక్క ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసి అందించాలని, ఈ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వామ్యం కావాలని అన్నారు. ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, వాటిని పూరించిన పిదప తిరిగి స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియ చేపడుతున్నామని తెలిపారు. ఈ దశలో బూత్ లెవల్ ఏజంట్ లు ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలు పూర్తి చేసి, బూత్ స్థాయి అధికారులకు అందజేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.07 శాతం పూర్తయినట్లు, కేవలం 3744 మంది ఓటర్లకు సంబంధించి అందుబాటులో లేకపోవడం, వివరాలు ట్రెస్ కాకపోవడంతో పంపిణీ కాలేదని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు 31.57 ఎన్యుమరేషన్ ఫారాలు ఓటరుచే వివరాలు పూరించిన మీదట తిరిగి తీసుకున్నట్లు, డిజిటలైజేషన్ ప్రక్రియ చేపడుతునట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏ) క్రీయాశీలకంగా ఉండి, వివరాల సేకరణలో సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్డీసి సదానందం, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, డిటి అన్సారీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, బిజెపి పార్టీ ప్రతినిధులు భూక్యా శ్యామసుందర్ నాయక్, వి. రాజేష్, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు బెల్లం వేణుగోపాల్, కె. వెంకట్ రావు, మంకెన రమేష్, ఆల్ల రాంబాబు, కోడిరెక్క ఉమాశంకర్, బిఆర్ఎస్వి ప్రతినిధి లింగనబోయిన సతీష్ బాబు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పసుమర్తి శ్రీనివాస్, టిడిపి పార్టీ ప్రతినిధి పాలడుగు టిఆర్ కృష్ణ ప్రసాద్, సిపిఎం పార్టీ ప్రతినిధి డి. తిరుపతి, సిపిఐ ఎం పార్టీ ప్రతినిధులు నెల్లూరి వీరబాబు, బీఎస్పీ పార్టీ ప్రతినిధి చెరుకుపల్లి నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

-నాణ్యతతో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



హంసకలం వార్త

మెట్‌పల్లి పట్టణంలో నిర్మాణ దశలో ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం, ప్రభుత్వ వైద్యశాల భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతిని పరిశీలించి నిర్మాణంలో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన విద్యా, వైద్య సేవలు అందించడంలో ఈ భవనాలు కీలకమని పేర్కొన్న కలెక్టర్, నిర్దేశించిన గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, నాణ్యమైన సామగ్రిని ఉపయోగించాలని స్పష్టం చేశారు. ప్రతి దశలో ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి పనుల నాణ్యతను నిర్ధారించాలని ఆదేశించారు. నిర్మాణ పనులతో పాటు విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలను కూడా సమాంతరంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తోందని, అధికారులు సమన్వయంతో పనిచేసి నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, తహసీల్దార్, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

-రెండు, మూడు రోజుల పాటు జ్వరం, జలుబు ఉంటే తప్పనిసరిగా పీహెచ్‌సీని సందర్శించాలి..

-ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా పరిశుభ్రత పాటించాలి..

-ప్రజల భాగస్వామ్యంతోనే సీజనల్ వ్యాధుల నివారణ సాధ్యం..


హంసకలం వార్త



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. జ్వరం, జలుబు, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు రెండు నుంచి మూడు రోజుల పాటు కొనసాగితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా తప్పనిసరిగా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)ను సందర్శించి వైద్య పరీక్షలు చేయించు కోవాలని కలెక్టర్ తెలిపారు. స్వీయ చికిత్సకు పాల్పడకుండా వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా వ్యాధులు తీవ్రం కాకుండా నివారించవచ్చని అన్నారు. సీజనల్ వ్యాధుల నివారణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశు భ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండే పరిస్థితులను పూర్తిగా నివారించాలని, నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా, చికన్‌గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఇళ్లలో ఉపయోగించకుండా ఉన్న పాత టైర్లు, పాత ఎయిర్ కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, డబ్బాలు, బకెట్లు, ఇతర పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా తరచూ పరిశీలించి శుభ్రం చేయాలని సూచించారు. ఇంటి నీటి ట్యాంకులను కూడా క్రమం తప్పకుండా శుభ్రం చేయడంతో పాటు మూతలు వేసి ఉంచాలని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు, స్థానిక సంస్థలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే సీజనల్ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చని తెలిపారు. జ్వరం, జలుబు, ఒళ్లునొప్పులు, తలనొప్పి లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రి లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య సేవలు పొందాలని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా తమ కుటుంబాన్ని, సమాజాన్ని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం బోనకల్ మార్గాలలో ట్రాఫిక్ ఆంక్షలు...

హంసకలం వార్త



ఈ నెల 10న రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మం జిల్లా చింతకాని మండలం, నామవరం క్రాస్ రోడ్, జగన్నాథపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభ కు వచ్చే రైతులు, ప్రజలు, అధికారులు, మీడియా, తదితర వాహనాలు మినహా ఖమ్మం నుండి బోనకల్ కు సాధారణ వాహనాల రాకపోకలు నిలిపివేయడం జరుగుతుందని వైరా ఏసీపీ సారంగపాణి తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ని దృష్టిలో పెట్టుకొని ఉదయం 6:00 గంటల నుండి రాత్రి 12:00 గంటల వరకు ఆంక్షలు అమలులో వుంటాయని, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలు వెళ్లాలని సూచించారు. ఖమ్మం నుంచి వయా పందిళ్లపల్లి, చింతకాని, బోనకల్, ఆంధ్రకు వెళ్లే వాహనాలు నేలకొండపల్లి మీదుగా వెళ్లాలని, అదేవిధంగా బోనకల్లు నుంచి ఖమ్మం వైపు వచ్చే వాహనాలు వైరా మీదుగా రావాలన్నారు. ధాంసలాపురం ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు దగ్గర నుంచి బోనకల్ బ్రిడ్జి వరకు సాధారణ వాహనాలు అనుమతించబడదు. చీశీవ: హైదరాబాదు నుంచి మీటింగ్ కి వచ్చే విఐపి వాహనాలు కోదాడ, నేలకొండపల్లి, ముదిగొండ లోని వల్లపురం నుంచి మీటింగ్ స్థలం కి త్వరగా చేరుకోవచ్చు ని తెలిపారు.

## కువైట్‌లో జిల్లా యువకుడి హత్య కేసు ఛేదన

**-ఎడారిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు**



హంసకలం వార్త

నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం కోరట్ పల్లి తండాకు చెందిన గుగులోతు కైలాస్ (30) కువైట్‌లో హత్యకు గురైన ఘటనలో కీలక పురోగతి చోటుచేసుకుంది. కువైట్ పోలీసులు రెండు నెలలపాటు దర్యాప్తు నిర్వహించి ఎడారిలో పాతిపెట్టిన కైలాస్ మృతదేహాన్ని వెలికితీశారు. సాంపల్లి గ్రామానికి చెందిన భదావత్ మరియు ఆయన కొడుకు కార్తీక్ కువైట్లో ప్రత్యేక వ్యాపారం చేసుకుంటున్నారు. కోరట్ పల్లి తండా కు చెందిన గూగులోట్ కైలాసం కలిసి ఖాళీగా ఉన్నావ్ కదా అని కువైట్ లోని ఎడారి ప్రాంతంలో పనిచేయడానికి తీసుకెళ్లగా కైలాస్ మృతి చెందాడు.దర్యాప్తులో భాగంగా డిచ్ పల్లి మండలం సాశీపల్లి గ్రామానికి చెందిన తండ్రి, కొడుకును విచారించగా, కైలాస్‌ను ఎడారి ప్రాంతానికి తీసుకెళ్లిన విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. అనంతరం మృతదేహాన్ని రహస్యంగా పాతిపెట్టినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లిన కైలాస్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండు నెలలుగా కుమారుడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఎంపీ ధర్మపురి అరవింద్‌ను కలిసి ఫిర్యాదు చేయగా, భారత రాయబార కార్యాలయం ద్వారా కువైట్ పోలీసులు విచారణ చేపట్టారు.కేసును ఛేదించిన కువైట్ పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి, సంబంధిత నిందితులపై చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. ఇదే సమయంలో డిచ్ పల్లి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న కైలాస్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తమ కుమారుడి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుని చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి ఓటరు పాల్గొనాలి

**-మైనార్టీ ఓట్లను తొలిగించే కుట్ర**

**-ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్**



హంసకలం వార్త

నిజామాబాద్ పట్టణంలోని బోధన్ రోడ్డులోని ఇంపీరియల్ గార్డెన్‌లో నిర్వహించిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) అవగాహన సదస్సులో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ మరియు మౌలానా జాఫర్ పాషా, మౌలానా షా జమాలు రహమాన్ , తాహెర్ బిన్ హందాన్ , ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మైనార్టీ ప్రాంత ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ, ప్రతి అర్హ ఓటరు ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పనిసరిగా పాల్గొని తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో సక్రమంగా ఉన్నాయో లేదో వెంటనే పరిశీలించి అవసరమైతే నమోదు, సవరణ, ధృవీకరణ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, ఎలాంటి డూప్లికేట్ ఓట్లు నమోదు కాకుండా అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సవరణ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. అవసరమైన పత్రాలను సమర్పించి నమోదు ప్రక్రియను ఆలస్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ, భారతీయ జనతా పార్టీపై రాజకీయ విమర్శలు చేస్తూ, కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉండే ఓట్లను, ముఖ్యంగా మైనార్టీ ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాంటి చర్యల కారణంగానే బెంగాల్, అస్సాం, బీహార్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ నష్టపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. అందువల్ల మైనార్టీలు, కాంగ్రెస్ అనుకూల ఓటర్లు మరింత అప్రమత్తంగా ఉండి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మైనార్టీ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబం తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని, కొత్తగా అర్హత పొందిన యువత ఓటరుగా నమోదు కావాలని ఆయన కోరారు. ఓటు హక్కును కాపాడుకోవడం అంటే ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడమేనని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, కార్యకర్తలందరి బాధ్యత అని షబ్బీర్ అలీ అన్నారు. గ్రామాలు, వార్డులు, కాలనీల స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి, ఎవరు ఓటరు నమోదు కాకుండా మిగిలిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. "ప్రతి అర్హ ఓటరు తన ఓటు హక్కును పరిరక్షించుకోవాలి. ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని మహమ్మద్ అలీ షబ్బీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ,మేయర్ ఉమారాణి, డిసిసి అధ్యక్షులు నగేష్ రెడ్డి, నిజామాబాద్ పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, మాజీ డిప్యూటీ మేయర్ ఫహీమ్ , పాప, ముజాహిద్ ఖాన్, హారున్ ఖాన్, కరీం, మహమ్మద్ భారీ, రత్నాకర్, మౌలానా లాయిక్, జాఫర్ హుస్సేన్, సబ్జార్, వహీద్, ఆసిఫ్, మీరాన్ అలీ, తదితరులు పాల్గొన్నారు

## సాగర్ ఆయకట్టు రైతన్నకు సీతారామ"భరోసా..

**-ఎగువ వరదను ఒడిసిపట్టి.. వైరాకు తరలింపు..**

**-రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలు..**

**-మంత్రి తుమ్మల ఆదేశాలతో షురూ**



హంసకలం వార్త

గోదావరి పరీవాహక ప్రాంతంలో, ముఖ్యంగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నదిలో వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏటా ఇలా వృథాగా సముద్రం పాలయ్యే గోదావరి జలాలను ఈసారి సద్వినియోగం చేసుకుని, ఆయకట్టు రైతులకు సాగునీటి భరోసా కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చురుగ్గా అడుగులు వేసింది. సీతారామ ఎత్తిపోతల పథకం మోటార్లను తక్షణమే ఆన్ చేసి, రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి నీటిని వైరా రిజర్వాయర్‌కు తరలించాలని నీటిపారుదల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు యుద్ధప్రాతిపదికన రంగంలోకి దిగిన అధికారులు నేటి ఉదయం బిజ్జి కొత్తూరు వద్ద మోటార్లను ఆన్ చేసి, గోదావరి జలాల తరలింపు ప్రక్రియను షురూ చేశారు.

**-వెనక్కు మళ్లిన నీళ్లు.. 13 కి.మీ. పయనం..**

సాధారణంగా సాగర్ మెయిన్ బ్రాంచ్ కెనాల్ ద్వారా ఆయకట్టుకు ముందుకు సాగాల్సిన గోదావరి జలాలను, ప్రస్తుత అవసరాల దృష్ట్యా ఓ వినూత్న పద్ధతిలో వెనక్కు మళ్లించే ఏర్పాట్లు చేశారు. సీతారామ మోటార్ల ద్వారా కాలువలోకి చేరిన నీటిని ఏకంగా 13 కిలోమీటర్ల దూరం వెనుకవైపు నడిపించి, అక్కడి నుంచి ఎస్కేప్ లాకుల ద్వారా వైరా రిజర్వాయర్‌లోకి మళ్లించనున్నట్లు మంత్రి తుమ్మల వివరించారు. ఈ సాంకేతిక ప్రక్రియ ద్వారా తరలుతున్న గోదావరి జలాలు రేపు మధ్యాహ్నానికల్లా వైరా రిజర్వాయర్‌ను చేరనున్నాయని, దీంతో రిజర్వాయర్ నీటి నిల్వ గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి ధీమా వ్యక్తం చేశారు.

**-వృథా కాకుండా వరద జలాల సద్వినియోగం..**

ఏటా వర్షాకాలంలో గోదావరిలో వచ్చే వరద జలాల్లో గణనీయ భాగం ఎలాంటి వినియోగం లేకుండా సముద్రంలో కలిసిపోతుండటం ఆనవాయితీ. ఈ ధోరణికి భిన్నంగా, సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి సామర్థ్యంతో వినియోగించుకుని, లభ్యమయ్యే ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ కృషిలో భాగంగానే వరద ఉధృతి పెరిగిన వెంటనే మోటార్లను ఆన్ చేసి, ఆ జలాలను అవసరమైన రిజర్వాయర్లకు తరలించే కార్యాచరణకు అధికార యంత్రాంగం సిద్ధమైంది.

**-సాగర్, వైరా ఆయకట్టుకు దీర్ఘకాలిక ప్రయోజనం..**

సీతారామ ప్రాజెక్టు ద్వారా జరుగుతున్న ఈ నీటి తరలింపు కేవలం తాత్కాలిక చర్య మాత్రమే కాదని, సాగర్ ఆయకట్టుతో పాటు వైరా పరిధిలోని రైతాంగానికి దీర్ఘకాలికంగా సాగునీటి భద్రత చేకూర్చే ప్రయత్నంగా అధికారులు అభివర్ణిస్తున్నారు. వర్షాభావ పరిస్థితులు తలెత్తినప్పుడు కూడా ఆయకట్టుకు నీటి ఎద్దడి రాకుండా ఇలాంటి ముందస్తు నిల్వ చర్యలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొంటున్నారు. వైరా రిజర్వాయర్ నీటి మట్టం పెరగడం వల్ల ఆ పరిధిలోని పలు గ్రామాల్లో తాగు, సాగునీటి అవసరాలకు ఢోకా ఉండదని అధికార వర్గాలు తెలిపాయి.

**-మంత్రి తుమ్మల పర్యవేక్షణ..**

గోదావరిలో వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన సందర్భాల్లో తక్షణ నిర్ణయాలు తీసుకుంటున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఈ తరలింపు ప్రక్రియను కూడా స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ, ప్రతి అవకాశాన్నీ ఆయకట్టు ప్రయోజనం కోసం వినియోగించుకోవాలన్న దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.

## పల్లెల ప్రగతి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలి

హంసకలం వార్త

గ్రామాల సంపూర్ణ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై సర్పంచ్ లు, గ్రామ సచివాలయ కార్యదర్శులకు బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛ భారత్ మిషన్ అమలు, పన్ను వసూళ్లు, తడి, పొడి చెత్త, హానికారక, సానిటేషన్ వ్యర్థాల సేకరణ, వీబీ జీ రాంజీ అమలు తీరు, మౌలిక వసతులు, సదుపాయాల కల్పన, వాటర్ షెడ్ కార్యక్రమాల అమలు, లింకు రోడ్లు, సీ.సీ రోడ్ల నిర్మాణాలు, వీధి దీపాల నిర్వహణ, నిధుల వినియోగం, వన మహోత్సవం, తాగు నీటి సరఫరా పర్యవేక్షణ, పాఠశాలలు, అంగన్వాడీలు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ సంస్థల నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన, పెన్షన్ల పంపిణీ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను గుర్తిస్తూ, వాటి పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ లు, కార్యదర్శులు పరస్పర సమన్వయంతో స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని, తద్వారా సంబంధిత అధికారులు, సిబ్బందితో నిర్దేశిత పద్ధతిలో సమస్యల పరిష్కారానికి కృషి చేయవచ్చని సూచించారు. ఏ గ్రామానికి ఏం అవసరం ఉంది అన్న వివరాలను ప్రభుత్వం తెలుసుకునేందుకు, తద్వారా అవసరమైన నిధులు, తగిన వనరులను సమకూర్చేందుకు గ్రామ పంచాయతీల సమగ్ర ప్రణాళిక దోహదపడుతుందని



తెలిపారు. ప్రాధాన్యత క్రమంలో పనులను గుర్తిస్తూ, 2026 -- 2029 కాల పరిమితితో కూడిన మూడు సంవత్సరాలకు సంబంధించి ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. స్థానికంగా అందుబాటులో ఉన్న వనరుల ద్వారా ఆదాయ మార్గాలను పెంపొందించుకోవాలని అన్నారు. అందరి సమన్వయంతో గ్రామాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని హితవు పలికారు. ప్రజల అవసరాలను గుర్తిస్తూ, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన గురుతర బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తు చేశారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఏవైనా లోటుపాట్లు ఉంటే అధికారుల దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ, అందరి సమన్వయంతో గ్రామాల సర్వతోముఖాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. దేశంలోనే మరెక్కడా లేనివిధంగా తెలంగాణాలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, సమగ్ర ప్రణాళికలు రూపొందించుకుని, తదనుగుణంగా ముందుకు వెళ్తే పల్లెలన్ని సంపూర్ణ ప్రగతితో వికసిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎం.పీ.డీ.ఓలు, ఎం.పీ.ఓలు, సర్పంచ్ లు, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

హంసకలం వార్త

వర్ని పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీనగర్ మరియు జాకోర గ్రామ పంచాయతీ కార్యాలయలో మన ఊరు మన భద్రత మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా 31 సీసీ కెమెరాలను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ప్రారంభించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడము ఎంతో సంతోషమని , ఒక్క సీసీ కెమెరా అనేది వంద మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాల ద్వారా గ్రామంలో జరిగే అనుమానాస్పద కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని , సాంకేతిక పరిజ్ఞానం వినియోగంతో పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని , నేరాల నివారణలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. అలాగే ట్రాఫిక్ నియంత్రణలో కూడా ఈ కెమెరాలు పోలీసులకు సహాయపడతాయని వివరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని , పోలీస్ శాఖకు సహకరించాలని కమిషనర్ సూచించారు. పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలకు



ప్రజలు ముందుకు వచ్చి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు వారి భద్రత కోసం సి సి కెమెరా లను పెట్టాలని చెప్పారు. ఇది వారి భాధ్యత గా తీసుకోవాలి. దుకాణాల యజమానులు తప్పనిసరిగా సి. సి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. శ్రీనగర్ గ్రామంలో 15 మరియు జాకోర గ్రామంలో 16 కెమెరాలు పెట్టి సహకరించిన గ్రామ పంచాయతీలను ను పోలీస్ కమీషనర్ అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనగర్ మరియు జాకోర గ్రామాలలో డ్రగ్స్ నివారణ , సైబర్ నేరాల పట్ల అవగాహన , రోడ్డు ప్రమాదాలను నివారణ కోసం అన్నీ రకాల జాగ్రత్త లు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎ.సి.పి. శ్రీనివాస్ , రుద్రూర్ సి.ఐ కృష్ణ , వర్ని ఎస్.ఐ జి. వంశీ కృష్ణ , కోటగిరి ఎస్.ఐ శ్రీనివాస్ , రుద్రూర్ ఎస్. ఐ మనోజ్ , శ్రీనగర్ సర్పంచ్ పూర్ణిమ కిరణ్ , జాకోర సర్పంచ్ బి. పెద్ద సాయిలు పలువురు పాల్గొన్నారు

# వర్షాకాల నేపథ్యంలో సంసిద్ధంగా జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(డిఆర్ఎఫ్) బృందం

-అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేందుకు సిద్ధంగా ఉండాలి

-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

హంసకలం వార్త



వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని వరదలు,అగ్నిప్రమాదాలు,రోడ్డు ప్రమాదాలు,ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టే oదుకు ఆర్.ఐ ఆధ్వర్యంలో 12 మంది సభ్యులతో కూడిన జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) బృందం పూర్తిస్థాయిలో సంసిద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.బుధవారం వేములవాడ పట్టణ పరిధిలోని నాంపెల్లి గ్రామ చెరువులో భారీ వర్షాలు, వరదలు,ప్రకృతి వైపరీత్యాల సమయంలో చేపట్టాల్సిన సహాయక చర్యలపై నిర్వహించిన శిక్షణ కార్య క్రమంలో జిల్లా ఎస్పీ పాల్గొన్నారు.ఈసందర్భంగా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) సభ్యులతో కలిసి రెస్క్యూ బోటులో ప్రయాణించి,సహాయక చర్యల నిర్వహణను పరిశీలించారు.అనంతరం డి ఆర్ ఎఫ్ అధికారులకు,సిబ్బందికి పలు సూచనలు చేస్తూ అత్యవసర పరిస్థితులు ఎదురైన వెంటనే వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను రక్షించేలా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వర్షాకాలంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.భారీ వర్షాలు,వరదలు,అగ్నిప్రమాదాలు,ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు జిల్లా పోలీసులతో పాటు జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) బృందం కూడా తక్షణమే సహాయక చర్యలకు సిద్ధంగా ఉంటుందని తెలిపారు.జిల్లా డిఆర్ఎఫ్ బృందం వద్ద రెస్క్యూ బోటు,మోటార్,మెడికల్ స్ట్రెచర్,లైఫ్ జాకెట్లు,లైఫ్ బాయ్స్,వుడ్ కట్టర్ యంత్రాలు తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ప్రజల ప్రాణ,ఆస్తి నష్టాన్ని నివారించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం,డిఆర్ఎఫ్ బృందం 24ఐ7 అందుబాటులో ఉంటుందని చెప్పారు. ఎవరైనా ఆపదలో ఉన్నట్లు గమనించినా లేదా సహాయం అవసరమైనా వెంటనే స్థానిక పోలీసు అధికారులకు సమాచారం అందించాలని,సమాచారం అందిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.గత ఏడాది వర్షాకాలంలో వరదల సమయంలో,అలాగే గణేష్ నిమజ్జనాల సందర్భంగా వివిధ అత్యవసర పరిస్థితుల్లో జిల్లా డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డిఆర్ఎఫ్) సిబ్బంది సమయోచితంగా స్పందించి ప్రజలకు అందించిన సేవలను అభినందించారు.అదే సేవా స్ఫూర్తితో భవిష్యత్తులో కూడా అప్రమత్తంగా ఉంటూ ప్రతి అత్యవసర పరిస్థితిలో వేగంగా స్పందించి ప్రజల ప్రాణాలను రక్షించేందుకు కృషి చేయాలని సూచించారు.ఈకార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసులు,సి.ఐ వీరప్రసాద్,ఆర్.ఐ అడ్మిన్ సురేష్,ఆర్.ఎస్.ఐలు సాయి కిరణ్,శ్రావణ్ యాదవ్,డిఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌ను 'క్లీన్ సిటీ'తో పాటు 'గ్రీన్ సిటీ'గా తీర్చిదిద్దుదాం

-నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

హంసకలం వార్త



వర్షాకాలం ముందస్తు ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న వనమహోత్సవ కార్యక్రమంపై నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అధ్యక్షతన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, కరీంనగర్‌ను పరిశుభ్రమైన 'క్లీన్ సిటీ'గా కొనసాగించడమే కాకుండా, పచ్చదనంతో కళకళలాడే 'గ్రీన్ సిటీ' గా తీర్చిదిద్దడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణం, సమృద్ధిగా ఆక్సిజన్ అందేలా రాబోయే ఐదేళ్లలో నగరాన్ని పూర్తిస్థాయి గ్రీన్ సిటీగా మార్చేందుకు వనమహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నగరవ్యాప్తంగా 4 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో సుమారు 3 లక్షల మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. ప్రతి ఇంటికి మూడు పండ్ల లేదా పూల మొక్కలను అందించనున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక డీజిల్ ఆటోల ద్వారా మొక్కలను నేరుగా వారి ఇళ్ల వద్దకే పంపిణీ చేసే ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన "ఒక లక్ష మొక్కలను" నగరంలోని ఖాళీ స్థలాలు, ప్రధాన రహదారుల ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ రూపంలో నాటనున్నారు. కొత్తగా నగరంలో విలీనమైన "మల్కాపూర్, కొత్తపల్లి, గోపాలపురం, దుర్శేడ్, బొమ్మకల్" తదితర గ్రామాల్లో విస్తృత స్థాయిలో ప్లాంటేషన్ చేపట్టాలని నిర్ణయించారు. ముఖ్యంగా 50 అడుగులు, 100 అడుగుల రహదారుల ఇరువైపులా మొక్కలు నాటడంతో పాటు, చెరువు కట్టలు, ఖాళీ ప్రభుత్వ స్థలాల్లో కూడా పెద్దఎత్తున మొక్కలు నాటనున్నారు. స్థానిక కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో అనువైన ప్రదేశాలను గుర్తించాలని సూచించారు. శివారు ప్రాంతాల్లో ఖాళీ స్థలాలను గుర్తించి బ్లాక్ ప్లాంటేషన్ చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్లాంటేషన్‌లో అధిక సంఖ్యలో పండ్ల మొక్కలు పెంచడం ద్వారా కోతులు నగర జనావాసాల్లోకి రాకుండా నియంత్రించవచ్చని మేయర్ తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్న మేయర్, మొక్కలకు నిరంతర నీటి సరఫరా కోసం ఇప్పటికే ఐదు బోరుబావులు మంజూరు చేసినట్లు తెలిపారు. నీటి ట్యాంకర్లపై ఆధారపడకుండా పైపుల ద్వారా డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని అమలు చేసే దిశగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకొని అధికారులు, ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ స్థానిక కార్పొరేటర్లు, డీఈలతో సమన్వయం చేసుకొని మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను వెంటనే గుర్తించాలని మేయర్ ఆదేశించారు. ఖర్చు చేసిన ప్రతి రూపాయికి, నాటిన ప్రతి మొక్కకు సార్థకత చేకూరేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేసి కరీంనగర్‌ను ఆకుపచ్చని నగరంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు కమిషనర్లు సువార్త, మొహమ్మద్ అయాజ్, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎలినినో ఎఫెక్ట్ దృష్ట్యా పంటల మార్పిడి తప్పనిసరి

-జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

-రైతులకు నానో యూరియా,వెదర్ అప్‌డేట్స్‌పై అవగాహన కల్పించాలి

హంసకలం వార్త




జిల్లాలో రైతులు సంప్రదాయ వరి సాగుకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల వైవిధ్యం వైపు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ పిలుపునిచ్చారు.బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన,నాబార్డ్, బ్యాంకింగ్,పరిశ్రమలు,డీఆర్డీఓ మరియు సహకార శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అమలవుతున్న పథకాలు ,రైతులకు అందుతున్న సేవలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఈ ఏడాది ఎలినినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని కలెక్టర్ ఆదేశించారు.ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు.విత్తనాలు, ఎరు వులను ముందస్తుగానే అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి,'నానో యూరియా' వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎరువుల కంపెనీలకు సూచించారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను జోడించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాతావరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేసేలా ప్లానింగ్ చేయాలన్నారు. అలాగే,పొలాల్లో మిగిలి పోయే వ్యవసాయ వ్యర్థాల ద్వారా బై-ప్రొడక్ట్స్ తయారు చేసి అదనపు ఆదాయం పొందే మార్గాలను రైతులకు వివరించాలన్నారు.

-సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నీటి నిల్వ సామర్థ్యం పెంచేందుకు డీఆర్డీఓ ఆధ్వర్యంలో ఫామ్ పాండ్స్, పర్కోలేషన్ ట్యాంక్స్, మినీ ట్యాంక్స్,ఓపెన్ వెల్స్ నిర్మాణానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. కూరగాయల సాగు చేసే వారికి పందిళ్ల ఏర్పాటుకు సబ్సిడీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎం కిసాన్,ఫార్మర్ రిజిస్ట్రీ,రైతు బీమా వంటి పథకాల్లో ఏ ఒక్క రైతుకూ అన్యాయం జరగకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో మట్టి నమూనాల సేకరణ వేగవంతం చేసి,భూసార కార్డుల ప్రాముఖ్యతను రైతులకు వివరించాలన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలా వ్యవసాయ అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేసి, సూర్యాపేట జిల్లాను ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి,డిఆర్డిఓ సన్యాసయ్య,జిల్లా ఆర్టికల్చర్ అధికారి నాగయ్య,పెర్టిలైజర్స్ వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో

-జిఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్ల వినియోగంపై జిల్లా పోలీసు సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం..

-ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించి బాధితులకు త్వరితగతిన న్యాయం చేకూర్చాలి ..

-జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




హంసకలం వార్త

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్ రాజు ఆదేశాల మేరకు ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్, స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు జిఆర్ఎం, ఎంఆర్ఎం సంబంధించి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో గ్రీవెన్స్ రెడ్రెస్సల్ మాడ్యూల్ (జిఆర్ఎం), మనీ రెస్టోరేషన్ మాడ్యూల్ (ఎంఆర్ఎం)ల వినియోగం, అమలు విధానం, ప్రజ ప్రయోజనాలపై సమగ్ర అవగాహన కల్పించారు. సైబర్ నేరాల్లో ప్రమేయం లేకపోయినా దర్యాప్తు ప్రక్రియలో బ్యాంకు ఖాతాలు లేదా నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జిఆర్ఎం ద్వారా తమ వినతులను సంబంధిత బ్యాంకులకు సమర్పించుకోవచ్చని, సంబంధిత అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు అర్హులైన వారి బ్యాంకు ఖాతాలను డీ-ఫ్రీజ్ చేయడం లేదా ఫ్రీజ్ అయిన నగదును విడుదల చేసే చర్యలు చేపడతారని వివరించారు. అలాగే సైబర్ మోసాలకు గురైన బాధితులకు కోల్పోయిన నగదును త్వరితగతిన పునరుద్ధరించేందుకు ఎంఆర్ఎం మాడ్యూల్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. రూ.50,000 లోపు అర్హత కలిగిన ఫ్రీజ్ అయిన మొత్తాన్ని కోర్టు ఉత్తర్వులు లేకుండానే, నిబంధనల ప్రకారం పరిశీలన అనంతరం బాధితులకు తిరిగి అందించే అవకాశం ఈ విధానంలో ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్స్ జిఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్లను సమర్థవంతంగా వినియోగించి ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. బ్యాంకులు, దర్యాప్తు అధికారులతో సమన్వయం పెంచి సైబర్ నేరాల బాధితులకు వేగంగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో సైబర్ సెల్ సీఐ జితేందర్, పోలీసు అధికారులు, సైబర్ వారియర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టి షర్ట్స్ పంపిణి




హంసకలం వార్త

లక్షెటిపేట మండల కేంద్రంలోని జెండా వెంకట పూర్ కాంప్లెక్స్దపరిధిలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బలరావుపేట గ్రామనికి చెందిన ఇండ్ల నవీన్ తన పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు స్పోర్ట్స్ టీ-షర్ట్స్ ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా జెండా వెంకటపూర్ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు యశోధర హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు,పాఠశాల ఉపాధ్యాయ బృందం, మరియు గతంలో పనిచేసిన ఉపాధ్యాయులు ఇండ్ల మల్లేశం,కందుల మోహన్,మండే చంటి, ధనిశెట్టి శ్రీనివాస్, గంగినేని హరీష్, బిల్ల భూమేష్, ధనిశెట్టి అంజన్న, భైరి అంజన్న, తదితరులు పాల్గొన్నారు.

# నార్కట్‌పల్లిలో అసంపూర్తి రోడ్డు విస్తరణ పనులు

-పూర్తి చేయాలని జేఏసీ ఆధ్వర్యంలో నిరసన

హంసకలం వార్త



జిల్లాలోని నార్కట్‌పల్లి పట్టణ కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లా డుతూ, రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు, వ్యాపారులు,వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా,రేపు నిర్వహించనున్న రిలే నిరాహార దీక్ష కార్యక్రమానికి పట్టణంలోని వ్యాపారులు, ఆటో యూనియన్ నాయకులు,వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు,ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్య క్రమంలో జేఏసీ నాయకులు చిరుమర్తి యాదయ్య,చింతపల్లి భయాన్న,వడ్డేపల్లి నాగరాజు,లింగాల యాదయ్య,మరిది శివకృష్ణ, దుబ్బాక శ్రీధర్, కొప్పు శ్రావణ్, అల్లె పరమేష్,దోసపాటి విష్ణుమూర్తి,బొబ్బలి దేవేందర్, దండు రవి, పసునూరి శ్రీనివాస్,పుల్లెంల వెంకట్,చెన్నారపు సత్తయ్య, మట్టపల్లి రాజు,బొబ్బలి మధు,షేక్ జానీ,గోసుల హరీష్, వెంకన్న,బొబ్బలి మహేష్,మంద సుధాకర్, అశోక్,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త

గురువారం 09 జూలై 2026

# బిజినెస్

## యమహా నుంచి ప్రీమియం ఈ-స్కూటర్ 'ఏరాక్స్-ఈ'లో అదిరే ఫీచర్లు



భారత్‌లో యమహా కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఏరాక్స్-ఈ'ని విడుదల చేసింది. దీని ధర రూ.2.82 లక్షలు (ఎక్స్‌షోరూమ్). ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో యమహా విక్రయిస్తున్న అత్యంత ఖరీదైన మోడల్‌గా ఇది నిలిచింది. కంపెనీ నుంచి భారత్‌లో విడుదలైన రెండో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం ఇదే. 'ఏరాక్స్-ఈ'లో రెండు 1.5కిలోవాట్ డిటాచబుల్ బ్యాటరీ ప్యాక్‌లను అందించారు. మొత్తం 3కిలోవాట్ సామర్థ్యంతో పనిచేసే ఈ బ్యాటరీలకు 9.5కిలో మోటార్‌ను జత చేశారు. ఈ మోటార్ గరిష్ఠంగా 12.9 హెచ్‌పీ శక్తి, 48చీఎ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఒక్కసారి పూర్తిగా ఛార్జ్ చేస్తే 117 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ వెల్లడించింది. రోజువారీ నగర ప్రయాణాలకు ఇది అనుకూలంగా ఉంటుందని తెలిపింది. ఈ స్కూటర్‌లో ఎకో, స్టాండర్డ్, పవర్ అనే మూడు రైడింగ్ మోడ్‌లు ఉన్నాయి. వీటితో పాటు బూస్ట్ మోడ్‌ను కూడా ఇచ్చారు. అవసరమైన సమయంలో అదనపు శక్తిని అందించి వేగంగా ఓవర్‌టేక్ చేయడానికి ఇది ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. బ్రేకింగ్ కోసం ముందు చక్రానికి ఏబీఎస్‌తో కూడిన డిస్క్ బ్రేక్, వెనుక చక్రానికి డిస్క్ బ్రేక్‌ను అమర్చారు. పెట్రోల్ ఏరాక్స్ 155 తరహాలోనే స్పోర్టీ రైడింగ్ అనుభూతిని అందించేలా ఈ స్కూటర్‌ను రూపొందించారు. అయితే ఎలక్ట్రిక్ వాహనం కావడంతో నిర్వహణ ఖర్చు తక్కువగా ఉంటుందని కంపెనీ పేర్కొంది. డిజైన్ పరంగా చూస్తే 'ఏరాక్స్-ఈ'లో పెట్రోల్ వెర్షన్‌కు దగ్గరి పోలికలు కనిపిస్తాయి. ట్విన్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, ఎల్ఈడీ టెయిల్‌ల్యాంప్‌తో అదే స్పోర్టీ లుక్‌ను కొనసాగించారు. సాధారణ ఏరాక్స్‌లో ఉండే ఎల్‌సీడీ డిస్‌ప్లే స్థానంలో ఇందులో టీఎఫ్‌టీ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్‌ను అందించారు. మొబైల్ యాప్ కనెక్టివిటీ సదుపాయం కూడా ఇందులో ఉంది. ప్రస్తుతం ఢిల్లీ, బెంగళూరు, ముంబయి, పుణె, చెన్నై నగరాల్లో ఈ స్కూటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. స్పోర్టీ డిజైన్, 117 కిలోమీటర్ల రేంజ్, ప్రీమియం ఫీచర్లతో పనితీరుకు ప్రాధాన్యం ఇచ్చే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని యమహా ఈ మోడల్‌ను తీసుకొచ్చింది.

## ఈపీఎఫ్ఓ చందాదారులకు గుడ్‌న్యూస్- జులై 15 నాటికి ఖాతాల్లోకి వడ్డీ జమ- ఇకపై దేశంలో ఎక్కడి నుంచైనా సేవలు!

న్యూఢిల్లీ, జూలై 8:

దేశంలోని కోట్ల మంది ఈపీఎఫ్ చందాదారులకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ రెండు తీపి కబుర్లు చెప్పింది. ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ తన కొత్త కేంద్రీకృత డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ను ప్రారంభించింది. దీనివల్ల సభ్యులు సేవలను పొందడం, వారి ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలను నిర్వహించుకోవడం సులభతరం అవుతుంది.ఇక, రెండో గుడ్ న్యూస్ ఏంటంటే.. ఈ సంస్థ వచ్చే వారంలోగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను 34 కోట్లకు పైగా ఖాతాలకు రూ. 1.44 లక్షల కోట్లకు పైగా వడ్డీని జమ చేయడం కూడా ప్రారంభించనుంది.అప్‌గ్రేడ్ చేసిన ఈ వ్యవస్థ సభ్యులకు మరింత సులభమైన, వేగవంతమైన సేవల్ని అందిస్తుందని భావిస్తున్నారు. షెడ్యూల్ చేసిన 'బ్లాక్‌అవుట్ పీరియడ్' పూర్తయిన తర్వాత, ఈ వారం నుంచి కొత్త ప్లాట్‌ఫామ్ పూర్తిస్థాయి అమలు ప్రారంభమవుతుంది.

**-పాత వ్యవస్థ నుంచి ఒక పెద్ద మార్పు**

ఇప్పటివరకు, వికేంద్రీకృత వ్యవస్థ ద్వారా పనిచేసేది. దీనిలో ప్రాంతీయ కార్యాలయాలు స్వతంత్రంగా పనిచేసేవి. సేవలను పొందడానికి లేదా సమస్యలను పరిష్కరించుకోవడానికి సభ్యులు తరచుగా తమ ఖాతా ఉన్న నిర్దిష్ట ప్రాంతీయ కార్యాలయంపై ఆధారపడవలసి వచ్చేది. కొత్త ప్లాట్‌ఫామ్ ప్రారంభంతో ఆ వ్యవస్థ మారిపోయింది. ఖ్యూఖీగా కేంద్రీకృత నమూనాగా మారింది. దీనివల్ల దేశవ్యా ప్తంగా ఉన్న ఏ ఈపీఎఫ్ఓ కార్యాలయంలోనైనా సభ్యుల సేవలను ప్రాసెస్ చేయడానికి వీలవుతుంది. దీనివల్ల సేవల డెలివరీ వేగవంతం అవుతుందని, అలాగే కార్యాలయ నిర్దిష్ట ప్రక్రియల వల్ల కలిగే జాప్యం తగ్గుతుందని భావిస్తున్నారు.

**-PF వడ్డీ జమ ప్రక్రియ ప్రారంభమైంది**

2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ డిపాజిట్లపై వడ్డీని జమ చేసే




ప్రక్రియను కూడా సంస్థ ప్రారంభించింది. అధికారుల ప్రకారం, ప్రస్తుతం క్షేత్రస్థాయి ధ్రువీకరణ జరుగుతోంది. ఇది రాబోయే రెండు రోజుల్లో పూర్తవుతుందని భావిస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత, వచ్చే వారంలోగా 34 కోట్లకు పైగా ఖ్యూఖీ ఖాతాలకు రూ.1.44 లక్షల కోట్లకు పైగా వడ్డీ జమవుతుంది. వచ్చే ఏడాది నుంచి వడ్డీ జమ చేసే ప్రక్రియ మొత్తం పూర్తిగా ఆటోమేటెడ్ అవుతుందని, తద్వారా మానవ ప్రమేయం తగ్గి ఈ ప్రక్రియ వేగవంతం అవుతుందని భావిస్తున్నారు.

## ట్రంప్ సంచలన ప్రకటనతో భగ్గుమన్న ముడి చమురు ధరలు

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడంతో ఇవాళ చమురు ధరలు 6 శాతానికి పైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచాయి. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా, అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడ్ అయింది. 'ఐఏఎన్ఎస్' తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి



చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ సైతం 20 పైసలు క్షీణించి 95.16 వద్ద కొనసాగుతోంది.

## ఫిఫా ప్రపంచకప్‌లో యూఎస్ వ్యూహాలపై ఇరాన్ ఘాటు విమర్శలు!

స్పోర్ట్స్ డెస్క్:

ఫిఫా ప్రపంచ కప్ 2026కు అమెరికా ఆతిథ్యం ఇవ్వడంపై ఇరాన్ అధ్యక్షుడు మసూద్ షెజెష్కియన్ విమర్శలు గుప్పించారు. ఫిఫా వరల్డ్ కప్‌లో యూఎస్ ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ జోక్యం చేసుకున్నారంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇరాన్ సైతం పలు ఆరోపణలు చేసింది. ఫిఫా ప్రపంచ కప్‌లో అమెరికా నిబంధనలను ఉల్లంఘిస్తోందని, ప్రత్యర్థులను బెదిరిస్తోందని, మోసం చేస్తోందని మసూద్ షెజెష్కియన్ ఆరోపించారు. ప్రపంచ కప్ ఆతిథ్య దేశంగా ఉన్న అమెరికా ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందని అన్నారు. అడ్డంకులు సృష్టించడం, మోసం చేయడమే వారి వ్యూహమని ఆయన పేర్కొన్నారు.ఇరాన్ ఇటువంటి మోసపూరిత ఆటలను తిరస్కరిస్తుందని, తాము హక్కుల కోసం దృఢంగా నిలబడతామని, అసరమైతే పోరాడతామని పెజెష్కియన్ ఎక్స్ లో రాసుకొచ్చారు. రౌండ్ ఆఫ్ 16లో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా చేతిలో ఈజిప్ట్ 3-2 తేడాతో నాటకీయంగా ఓడిపోయిన తర్వాత మసూద్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ జట్టు రెండు గోల్స్ ఆధిక్యాన్ని చేజార్చుకున్న తర్వాత, అర్జెంటీనాకు, అలానే కెప్టెన్ లియోనెల్ మెస్సీకి ఫీఫా అనుకూలంగా వ్యవహరిస్తోందని ఈజిప్ట్ హెడ్ కోచ్ హోసామ్ హసన్ ఆరోపించిన సంగతి తెలిసిందే. మైదానంలో జరిగిన గొడవ సమీక్ష తర్వాత, రెండవ అర్ధభాగంలో మోస్తఫా జికో చేసిన గోల్‌ను అంపైర్ తిరస్కరించాడు. ఆ నిర్ణయం మ్యాచ్‌లో అత్యంత చర్చనీయాంశమైన విషయాల్లో ఒకటిగా నిలిచింది. బెల్జియంతో జరిగే మ్యాచ్‌కు ముందు, యూఎస్




ఫార్వర్డ్ ఫోలారిన్ బలోగన్‌కు చూపిన రెడ్ కార్డ్, ఫలితంగా ఒక మ్యాచ్ నిషేధం పడింది. దీనిపై సమీక్షించాలని తాను ఫిఫా అధ్యక్షుడు గియానీ ఇన్ఫాంటినోతో మాట్లాడినట్లు ట్రంప్ 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేసిన మరో సంఘటన నేపథ్యంలో ఇవాళ అర్జెంటీనాతో జరిగిన మ్యాచ్‌లో ఈజిప్ట్ వివాదం తలెత్తింది.

## గౌతమ్ గంభీర్ నిర్ణయంపై దినేష్ కార్తిక్ విమర్శలు

స్పోర్ట్స్ డెస్క్:

ఇంగ్లండ్ చేతిలో టీమిండియాకు దారుణమైన పరాభవం ఎదురైంది. నాటింగ్‌హామ్ వేదికగా మూడో టీ20 మ్యాచ్‌లో 125 పరుగుల తేడాతో భారత్ ఓడిపోయింది. ఈ పరాజయంపై మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ స్పందించారు. బ్యాటింగ్ ఆర్డర్‌లో మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమని అతడు విమర్శించాడు.మ్యాచ్ సమయంలో ఓ స్పోర్ట్స్ ఛానల్‌లో అతడు ప్రత్యక్ష ప్రసారంలో ఉండగా ఆగ్రహానికి గురై, దూబే కంటే ముందు రాణాను పంపాలన్న నిర్ణయంపై అసహనం వ్యక్తం చేశాడు. 'శివమ్ దూబే కంటే ముందు హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడమా, మీరు నన్ను ఆటపట్టిస్తున్నారా?' అని కార్తీక్ లైవ్‌లో అనడం వినిపించింది. 'దేశీయ క్రికెట్‌లో కూడా హర్షిత్ రాణా పవర్ ప్లేలో ఎప్పుడూ బ్యాటింగ్ చేసినట్లు చూడలేదు. టీ20ల్లో కుడి-ఎడమ కాంబినేషన్ కోసం మీరు ప్రయత్నించారు. కానీ, ఇది ఒక దశ వరకు మాత్రమే బాగుంటుంది. అంతేకానీ, దూబే స్థానంలో హర్షిత్ రాణా బ్యాటింగ్‌కు రావడం మాత్రం సరైన నిర్ణయం కాదు' అని దినేశ్ వ్యాఖ్యానించాడు. ఆరో డౌన్‌లో వచ్చిన హర్షిత్ 13 బంతుల్లో 9 పరుగులు చేశాడు.




ఆ తర్వాత వచ్చిన దూబే (2) కూడా ఎక్కువసేపు నిలవలేదు. మరోవైపు టీమిండియా ఓడిపోవడంపై సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో కామెంట్లు వస్తున్నాయి. మరీ ముఖ్యంగా మేనేజ్‌మెంట్ తీరుపై ఫ్యాన్స్ విమర్శలు చేస్తున్నారు. గత ఐదు టీ20ల్లో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. ఇంగ్లండ్‌తో మూడో టీ20లోనూ బ్యాటింగ్ వైఫల్యం కొట్టొచ్చింది. బ్యాటర్లలో ఎవరూ బాధ్యత తీసుకోవడం లేదని ఫ్యాన్స్ కామెంట్లు చేశారు. 2009 తర్వాత ఇదే అత్యంత సుదీర్ఘమైన ఓటముల పరంపర కావడం గమనార్హం.

# స్పోర్ట్స్

## వైభవ్ సూర్యవంశీతో ఇప్పుడు స్కోర్ సమం అయింది: జోఫ్రా ఆర్చర్

ఇంటర్నెట్ డెస్క్:




టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ, ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ మధ్య ఆసక్తికర పోటీ మొదలైంది. రాజస్థాన్ రాయల్స్ తరపున ఐపీఎల్‌లో ఒకే జట్టుకు ఆడిన ఈ ఇద్దరూ.. ఇప్పుడు భారత్--ఇంగ్లండ్ టీ20 సిరీస్‌లో ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. మూడో టీ20 అనంతరం వైభవ్‌తో తన పోటీపై ఆర్చర్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి.మాంచెస్టర్‌లో అరంగేట్ర మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ ఆర్చర్ బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది తన అంతర్జాతీయ కెరీర్‌ను ఘనంగా ప్రారంభించాడు. ట్రెంట్ బ్రిడ్జ్‌లో జరిగిన మూడో టీ20లో కూడా ఆర్చర్ బౌలింగ్‌లో మరో రెండు సిక్సర్లు బాదాడు. అయితే ఈసారి చివరికి పైచేయి సాధించింది ఆర్చరే. ఐదు బంతుల్లో 13 పరుగులు చేసిన వైభవ్‌ను క్యాచ్ ఔట్ చేసి అతడి ఇన్నింగ్స్‌కు ముగింపు పలికాడు. మ్యాచ్ అనంతరం ఈ పోటీ గురించి ఆర్చర్ మాట్లాడాడు. 'ఇప్పుడు మా ఇద్దరి మధ్య స్కోరు సమం అయింది. అతడు సిక్సర్లు బాదాడు.. నేను ఔట్ చేశాను. ఇంకా రెండు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. ఏం జరుగుతుందో చెప్పలేం. చివరికి ఎవరు మెరుగ్గా రాణిస్తారో వారే విజేత అవుతారు' అంటూ యువ బ్యాటర్‌కు ఆర్చర్ సరదాగా సవాల్ విసిరాడు. ఇదిలా ఉండగా, ఇంగ్లండ్‌తో మూడో టీ20లో భారత్ ఘోరంగా విఫలమైంది. 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో కేవలం 76 పరుగులకే ఆలౌట్ అయి 125 పరుగుల భారీ తేడాతో ఓడిపోయింది. ఈ విజయంతో ఐదు టీ20ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-0 ఆధిక్యంలోకి వెళ్లింది. మూడు ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టిన ఆర్చర్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. ఇప్పుడు సిరీస్‌లో నిలవాలంటే భారత్ తప్పనిసరిగా నాలుగో టీ20లో విజయం సాధించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గురువారం బ్రిస్టల్ వేదికగా జరిగే మ్యాచ్‌లో ఓడితే సిరీస్ ఇంగ్లండ్ ఖాతాలో చేరనుంది.

# ‘టాక్సిక్’ నుంచి తొలి పాట విడుదల

**-యశ్ ‘టాక్సిక్’ నుంచి ‘తబాహి’ వీడియో సాంగ్ విడుదల**
**-ఆకట్టుకుంటున్న యశ్, కియారా అద్వానీల ఆన్-స్క్రీన్ కెమిస్ట్రీ**
**-గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో భారీ తారాగణం**
**-ఆగస్టు 26న సినిమా ప్రపంచవ్యాప్త విడుదల**

యశ్ హీరోగా నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం ‘టాక్సిక్’ నుంచి ‘తబాహి’ పేరుతో తొలి వీడియో సాంగ్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం ఈ వీడియో సాంగ్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. పాటలో యశ్, కియారాల జోడీ, వారి మధ్య చిత్రీకరించిన సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. విజువల్స్ పరంగా పాట బాగుందని చెప్పచ్చు. ఈ పాట తెలుగు వెర్షన్‌కు ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా వంటి భారీ తారాగణం నటిస్తోంది. రవి బస్రూర్, తనిష్క్ బాగ్చీ సంగీతం అందిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై యశ్ స్వయంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




## ‘నేను యూపీ వాడిని.. అయోధ్యలో భూమి కావాలి’: తెల్లవారుజామున 3 గంటలకు వ్యాపారికి అమితాబ్ ఫోన్ కాల్



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్, పవిత్ర నగరమైన అయోధ్యలో తన పెట్టుబడులను గణనీయంగా విస్తరిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలలో ఆయన రూ. 35 కోట్లతో 2.67 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ లావాదేవీని అమితాబ్ కంపెనీ ఏబీ కార్ప్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేశ్ యాదవ్ పూర్తి చేశారు. అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో పెరుగుతున్న ఆసక్తికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ‘ది హౌస్ ఆఫ్ అభినందన్ లోధా’ (ఎశీూదీూ) వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అభినందన్ లోధా ఇటీవల జరిగిన ‘హిందుస్థాన్ టైమ్స్ ఇండియా నెక్ట్స్ రియల్ ఎస్టేట్ సమ్మిట్ 2026’లో అమితాబ్‌తో తన సంభాషణను గుర్తుచేసుకున్నారు. 2023లో తాను ఆస్ట్రేలియాలో ఉన్నప్పుడు, అక్కడి కాలమానం ప్రకారం తెల్లవారుజామున 3 గంటలకు ఒక ఫోన్ కాల్ వచ్చిందని తెలిపారు. “కొన్ని మిస్డ్ కాల్స్ తర్వాత, ‘ఇది అమితాబ్ బచ్చన్, వీలైనప్పుడు కాల్ చేయండి’ అని మెసేజ్ వచ్చింది. నేను ఆశ్చర్యపోయి వెంటనే లేచి నిలబడి ఆయనకు కాల్ చేశాను” అని లోధా వివరించారు. ఆ సంభాషణలో.. “‘అభినందన్ జీ, నేను ఉత్తరప్రదేశ్‌కు చెందిన వాడిని. నాకు అయోధ్యలో భూమి కావాలి’ అని అమితాబ్ తనతో చెప్పినట్లు లోధా తెలిపారు. ‘తప్పకుండా మీ కోసం ఏర్పాటు చేస్తాం’ అని తాను బదులిచ్చానన్నారు. ఆ తర్వాత ధర గురించి అమితాబ్ అడగ్గా.. “‘మీతో ధరల గురించి నేనెలా మాట్లాడగలను?’ అని నేను సమాధాన మిచ్చాను. తనకు 15,000 చదరపు అడుగుల స్థలం కావాలన్నారాయన. దాని విలువ సుమారు రూ. 15 కోట్లు ఉండొచ్చని చెప్పాను. ఆశ్చర్యకరంగా, ఆ మరుసటి రోజే ఆయన నాకు రూ. 15 కోట్లు పంపించారు” అని లోధా వెల్లడించారు.

## బ్యాక్ టు బ్యాక్ భారీ ప్రాజెక్టులు: ‘జై హనుమాన్’ తర్వాత ‘ఛత్రపతి శివాజీ మహారాజ్’గా రిషబ్ శెట్టి!

**-పుట్టినరోజు సందర్భంగా ‘కాంతార’ ఫ్రాంచైజీ తదుపరి చిత్రంపై రిషబ్ శెట్టి స్పష్టత**
**-‘కాంతార: చాప్టర్ 2’ కోసం రచయితల బృందంతో కలిసి కథా చర్చలు ప్రారంభం**
**-రెండు చిత్రాల కోసం ప్రత్యేకమైన మేకోవర్స్ మార్చనున్న కన్నడ స్టార్**
**-‘ది ప్రైడ్ ఆఫ్ భారత్’ చిత్రంలో ఔరంగజేబుగా నటిస్తున్న వివేక్ ఒబెరాయ్**

కన్నడ స్టార్, జాతీయ అవార్డ్ విజేత రిషబ్ శెట్టి తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే అప్‌డేట్స్ ఇచ్చాడు. ‘కాంతార’ సినిమాతో సంచలన విజయం అందుకున్న ఈ నటదర్శకుడు.. ఈ ఫ్రాంచైజీలో రాబోయే తదుపరి భాగం గురించి ఒక ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ‘కాంతార: చాప్టర్ 2’ కోసం తన రచయితల బృందంతో కలిసి పని ప్రారంభించినట్లు ఆయన స్పష్టం చేశాడు. దర్శకత్వంపై తనకున్న అమితమైన ఇష్టాన్ని వివరిస్తూ.. “నేను ఖాళీగా కూర్చోలేను, నా డైరెక్షన్ వర్క్ నేను చేసుకోకపోతే నాకు మనశ్శాంతి ఉండదు. నా దర్శకత్వ బాధ్యతలు నాకు ఎంతో సంతోషాన్ని, ప్రశాంతతను ఇస్తాయి. ప్రస్తుతం నా రైటర్స్ టీమ్‌తో కలిసి ‘కాంతార: చాప్టర్ 2’ స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నాను” అని రిషబ్ శెట్టి వెల్లడించారు. బ్యాక్ టు బ్యాక్ క్రేజీ ప్రాజెక్టులు కేవలం ‘కాంతార’ మాత్రమే కాకుండా భవిష్యత్తులో తాను నటించబోయే రెండు క్రేజీ చిత్రాల గురించి కూడా రిషబ్ క్లారిటీ ఇచ్చారు. “నాకు బ్యాక్ టు బ్యాక్ రెండు పెద్ద సినిమాలు లైన్లో ఉన్నాయి. నేను ఒకేసారి రెండు సినిమాల షూటింగ్స్ చేయలేను. అందుకే మొదట ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో రాబోయే ‘జై హనుమాన్’ సినిమా పూర్తి చేస్తాను. ఆ తర్వాతే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న ‘ది ప్రైడ్ ఆఫ్ భారత్: ఛత్రపతి శివాజీ మహారాజ్’ సినిమా సెట్స్‌పైకి వెళ్తుంది. ఈ రెండు చిత్రాల కోసం నేను పూర్తిగా భిన్నమైన రూపాల్లో కనిపించాల్సి ఉంది” అని చెప్పాడు. వివేక్ ఒబెరాయ్ ఎమోషనల్ పోస్ట్ రిషబ్ శెట్టి పుట్టినరోజు సందర్భంగా సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే ‘ది ప్రైడ్ ఆఫ్ భారత్’ సినిమాలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పాత్రలో నటిస్తూ రిషబ్‌తో స్క్రీన్ షేర్ చేసుకోబోతున్న బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ వేదికగా పెట్టిన పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. “సినిమా అనేది ఒక అద్దం లాంటిది, కానీ రిషబ్ శెట్టి సినిమా ఒక సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే పోర్టల్ లాంటిది. మట్టి, నిప్పు, హద్దులు దాటిన నీ విజన్‌తో నువ్వు సినిమా రూల్స్‌నే మార్చేశావు బ్రదర్. ప్రతి పనిలోనూ రక్తాన్ని, చెమటను చిందించే మాస్టర్ క్రాఫ్ట్‌మన్‌కు జన్మదిన శుభాకాంక్షలు. నీతో కలిసి త్వరలోనే ఒక ఎపిక్ వండర్‌ను స్క్రీన్‌పై క్రియేట్ చేయడానికి నేను ఎంతగానో ఎదురుచూస్తున్నాను” అంటూ వివేక్ ఒబెరాయ్ ప్రశంసల జల్లు కురిపించాడు.



# ‘కరక్కం’ (సోనీ లివ్) మూవీ రివ్యూ!

మలయాళంలో హారర్ కామెడీ జోనర్ నుంచి ఏదైనా సినిమా వచ్చిందంటే, ఓటీటీ ప్రేక్షకులు చాలా ఆసక్తి చూపిస్తారు. అందుకు కారణం ఈ తరహా కథలను వాళ్ళు చాలా ఇంట్రెస్టింగ్ గా హ్యాండిల్ చేస్తారని భావిస్తారు. అందుకు తగినట్టుగానే ఈ జోనర్ నుంచి వచ్చిన సినిమాలలో చాలావరకూ థియేటర్ల దగ్గర మంచి వసూళ్లను రాబడుతూ ఉంటాయి. అలా మే 28వ తేదీన విడుదలైన సినిమానే ‘కరక్కం’. సుభాశ్ లలిత దర్శకత్వం వహించిన ఈ సినిమా, ఈ నెల 3వ తేదీ నుంచి ‘సోనీ లివ్’లో స్ట్రీమింగ్ అవుతోంది. ంధనుష్ (శ్రీనాథ్ భాసి) ఒక డాన్సర్. అతను పెద్దగా సంపాదించకపోవడంతో కుటుంబ సభ్యుల నుంచి అసహనాన్ని ఎదుర్కుంటూ ఉంటాడు. ‘పింకీ’ (ఫెమీనా జార్జ్) ప్రేమతో ఆ బాధను మరిచిపోతుంటాడు. అలాంటి పరిస్థితులలో అతనికి ‘ఖాజా’ (ప్రవీణ్) పరిచయమవుతాడు. న్యూ ఇయర్ వేడుకలలో బాగా తాగేసిన ఆ ఇద్దరూ, స్మశానానికి చేరుకుంటారు. విపరీతంగా తాగేసిన కారణంగా అక్కడే పడిపోతారు. కాస్త మత్తు వదిలిన తరువాత అక్కడి నుంచి బయల్దేరతారు. అప్పుడే ఆ స్మశానంలో సమాధులపై ఉంచబడిన ఐదు ఇత్తడి శిలువలు కనిపిస్తాయి. దాంతో వాటిని అమ్మేసి సొమ్మును చేసుకోవచ్చనే ఆలోచనతో వాటిని లాగేస్తారు. ఆ సమయంలోనే తన రూమ్ ‘కీ’ని ధనుష్ అక్కడ పారేసుకుంటాడు. ఆ తరువాత ఆ శిలువలను అమ్మడానికి వెళ్లగా, అలాంటి వస్తువులను కొనే ‘వర్గీస్’ చనిపోతాడు. దాంతో వాటిని ఏం చేయాలనేది వాళ్లకి పాలుపోదు.’కీ’ కోసం మళ్లీ స్మశానానికి వెళ్లిన వాళ్లకి అక్కడ పోలీసులు ఉండటం చూస్తారు. శిలువలను తీసిన వారిని ప్రేతాత్మలు వెంటాడతాయని అక్కడ ఫాదర్ చెప్పడం విని భయపడిపోతారు. అప్పటి నుంచి నిజంగానే ఐదు ప్రేతాత్మలు వాళ్లను వెంటాడటం మొదలుపెడతాయి. డాన్స్ ట్రూప్ కి సంబందించిన డ్రెస్ లో ప్రేతాత్మలు కనిపించడం వాళ్లకి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ విషయంలో వాళ్లు పారా సైకాలజిస్ట్ ‘నకుల్’ను కలుస్తారు. అతనికి కూడా దెయ్యాల వలన భయంకరమైన అనుభావం ఎదురవుతుంది. దాంతో వాళ్లంతా ఫాదర్ ను కలిసి పరిస్థితిని వివరిస్తారు. 30 ఏళ్లనాటి ఆ సమాధులు ఎవరివనేది తెలుసుకుని, వాళ్ల బంధువులను తీసుకొస్తే .. వాళ్లతో శిలువలు పెట్టించవలసి ఉంటుందని ఫాదర్ చెబుతాడు. దాంతో ధనుష్ .. అతని లవర్ పింకీ .. ఖాజా .. పారా సైకాలజిస్ట్ నకుల్ అందరూ కలిసి, ప్రేతాత్మలుగా కనిపిస్తున్న వారి వివరాలను సేకరించడం కోసం రంగంలోకి దిగుతారు. ఆ ప్రయత్నంలో వాళ్లకి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? ఇంతకీ చనిపోయిన ఆ ఐదుగురు ఎవరు? వారి చావుకు కారకులు ఎవరు? ఎందుకు ప్రేతాత్మలుగా మారతారు? అనేది మిగతా కథ. సమాధులలో నుంచి ప్రేతాత్మలు బయటికి రావడం .. కథానాయకుడి వెంటపడటం ఫస్టాఫ్ గా, అలా వెంటాడుతున్న ప్రేతాత్మల నుంచి బయటపడటానికి హీరో బృందం ప్రయత్నించడం సెకండాఫ్ గా ఈ సినిమా నడుస్తుంది. అసలు చనిపోయినదెవరు? అనే అంశంతో ఈ కథ ప్రీ క్లైమాక్స్ దిశగా పరిగెడుతుంది. వాళ్లు చనిపోవడానికి కారకులైనవారిని బయటికి తీసే ప్రయత్నంతో ఈ కథ క్లైమాక్స్ కి చేరుకుంటుంది. ఈ కథలో ప్రధానమైన పాత్రలు రెండే. కీలకమైనవిగా మరో రెండు .. మూడు పాత్రలు ఆ తరువాత తెరపైకి వస్తాయి. ఇక ప్రేతాత్మల పాత్రలు అప్పుడప్పుడు తెరపై మెరుస్తాయి. ఇది మ్యూజికల్ హారర్ కామెడీ అని చెప్పారు. కానీ ఎక్కడా హారర్ అనేది కనిపించదు .. కామెడీ అనేది నవ్వించదు. ప్రేతాత్మలు డాన్స్ ట్రూప్ కాస్ట్యూమ్స్ తో కనిపించడం అటు హారర్ .. ఇటు కామెడీ రెండూ వర్కౌట్ కాకుండా చేసిందని చెప్పొచ్చు. తెరపైకి ప్రేతాత్మలు రాగానే ఆడియన్స్ లో ఈ కంటెంట్ పై ఇంట్రెస్ట్ పోతుంది. ప్రేతాత్మలుగా మారినవాళ్లు ఎందుకు చనిపోయారు? అందుకు దారితీసిన పరిస్థితులేమై ఉంటాయి? అనే అంశాలు ఉత్కంఠను రేకెత్తించే అవకాశం ఉందనే చిన్న ఆశ ఆడియన్స్ ను అలా కూర్చోబెడుతుంది. కానీ ఆ అంశాలు కూడా అప్పటి వరకూ సాగిన కథకు భిన్నంగా ఏమీ అనిపించవు. ఫ్లాష్ బ్యాక్ బలమైనదిగా కానీ, బరువైనదిగా కానీ కనిపించదు. నటీనటుల నటన గురించి చెప్పుకునే స్థాయిలో పాత్రలను మలచడం జరగలేదు. బబ్లూ అజూ ఫొటోగ్రఫీ ఫరవాలేదు. సామ్ సీఎస్ నేపథ్య సంగీతం అక్కడక్కడా సన్నివేశాలను .. సంభాషణలను డామినేట్ చేయడం వినిపిస్తుంది. నిధిన్ రాజ్ ఎడిటింగ్ ఓ మాదిరిగా అనిపిస్తుంది. ఇది చాలా సింపుల్ కంటెంట్. కథాకథనాలపై పెద్దగా కసరత్తు జరగలేదు. బలహీనమైన హారర్ సన్నివేశాలతో .. పేలవమైన కామెడీతో సాగుతుంది. కంటెంట్ కి అన్నివైపుల నుంచి అవసరమైన హంగులను అద్దుతూ ఆసక్తిని రేకెత్తించాలనే ప్రయత్నం జరగలేదు. సిల్లీ సన్నివేశాలతో సాగిపోతూ, అసహనానికి గురిచేస్తుంది.




Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449